

# మాణిక్యేశ్వరి మాత సందేశాలు

2



రచన :
బ్రహ్మర్షి
తటవర్తి వీరరాఘవరావు

# మాణిక్యేశ్వరి మాత సందేశాలు
(పార్ట్-2)



రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,

మొదటి ముద్రణ : మార్చి, 2026
ప్రతులు : 2,000

వెల : రూ. 50/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 16) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 17) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 18) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 19) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 20) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

## “ప్రారబ్ధ కర్మల ఆధారంగానే ప్రస్తుత జన్మ తీసుకున్నారు. ఇతరులకు మంచి చేయడం ద్వారా వర్తమానంలో వాటి చెడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.”

పత్రిగారు చెప్తూ ఉంటారు. మీ జ్ఞానం వృద్ధి కావాలి అంటే జ్ఞానుల నుంచి నేర్చుకోవాలి. వారి సందేశాలు తెలుసుకుంటూ ఉండాలి, వింటూ ఉండాలి, వాటిని ఆచరించే ప్రయత్నం చేయాలి. అలా ఎంత చేస్తూ ఉంటారో అంత మీ జ్ఞానాన్ని పెంచుకుంటారు. జ్ఞానం పెరిగే కొద్ది “మీ దుఃఖం తగ్గుతూ ఉంటుంది.” ఎంత జ్ఞానం సంపాదించుకుంటారో మీ దుఃఖం అంత తగ్గినట్టే లెక్క. లోకంలో ప్రతి ఒక్కరు దుఃఖం ఉండకూడదని అనుకుంటారు. అంటే ఏ సమస్య, ఏ బాధ, ఏ రోగం, ఏ కష్టం, ఏ నష్టం జరగకూడదని ప్రతి ఒక్కరు కోరుకుంటారు.

ప్రతి ఒక్కరికి ఎన్నో రకాల సమస్యలు ఉంటాయి. కుటుంబ పరంగా భర్త నుంచి భార్యకి, భార్య నుంచి భర్తకి, అలాగే పిల్లల నుంచి తల్లిదండ్రులకి, సహజంగా వృద్ధులైన తల్లిదండ్రులకి వారి పిల్లల నుంచే ఎక్కువ బాధలు కనిపిస్తూ ఉంటాయి. అంతేకాదు అన్నదమ్ముల నుంచి, బంధువుల దగ్గర నుంచి ఎన్నో రకాలైనటువంటి సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు.

ఇటువంటి స్థితిలో వీటిని మీరు తేలికగా అధిగమించాలి అంటే? జ్ఞానవంతులు కావడమే అన్నిటికంటే గొప్ప పరిష్కార మార్గం. అందుకే పత్రిగారు జ్ఞానం సంపాదించుకోండి, అజ్ఞానంలో జీవించకండి అని చెప్తూ ఉంటారు.

దానికి ఆయన ముఖ్యంగా ధ్యాన సాధన బాగా చేయండి అంటారు, ఆత్మజ్ఞానుల పుస్తకాలు చదవమంటారు, ధ్యానం ఎంత ముఖ్యమో ఆ పుస్తకాలు అధ్యయనం చేయడం కూడా అంతే ముఖ్యం అంటారు. అందుకే ఇప్పుడు మీరు మాణికేశ్వరి మాత సందేశాలు తెలుసుకుంటున్నారు.

ఆవిడ దగ్గరికి ఎంతో మంది వచ్చేవారు. వాళ్ళందరికీ ఆవిడ ఇచ్చిన అద్భుతమైన సందేశాలు అర్థం చేసుకొని, ఆచరణలో పెడితే ఖచ్చితంగా జీవితంలో ఎంతో లాభం పొందుతారు, దేనికోసం ఆవిడ దగ్గరికి వెళ్ళారో అవి వాళ్ళు పొందగలుగుతారు.

ఆవిడ **"మీ ప్రారబ్ధ కర్మల ఆధారంగానే ప్రస్తుత జన్మ తీసుకున్నారు, ఇతరులకు మంచి చేయడం ద్వారా వర్తమానంలో వాటి చెడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు."** అన్నారు.

చాలా అద్భుతమైనటువంటి సందేశం ఇది. ప్రతి ఒక్కరు ఎన్నో కోరికలతో, కష్టాలతో, బాధలతో ఆవిడ దగ్గరికి వచ్చి వేడుకుంటూ ఉంటారు, పాదాల మీద పడుతూ ఉంటారు.

వాళ్ళందరినీ ఉద్దేశించి ఆవిడ పరిష్కారం సూచించారు, దీంట్లోనే ఎంతో రహస్యం దాగి ఉంది. ఆవిడ ఏమన్నారంటే మీ ప్రారబ్ధ కర్మల ఆధారంగానే ప్రస్తుత జన్మ తీసుకున్నారు. ఇక్కడ మీరు గుర్తుపెట్టుకోండి. కర్మలు మూడు రకాలు ప్రారబ్ధ కర్మలు, సంచిత కర్మలు, ఆగామి కర్మలు అంటే వర్తమాన కర్మలు. కర్మలు అంటే మీరు చేసే పనులు, మీరు మాట్లాడే మాటలు రెండూ కర్మలే. ఈ కర్మల యొక్క సిద్ధాంతం ఏమిటంటే "ఏ కర్మ చేసినా దాని ఫలితం అనుభవించాల్సిందే.". చెడు కర్మ చేస్తే చెడ్డ ఫలితం అలాగే మంచి కర్మ చేస్తే మంచి ఫలితం అంటే పాపకర్మలు చేసినవారు దుఃఖం అనుభవిస్తారు, పుణ్య కర్మలు చేసినవారు భోగాన్ని అనుభవిస్తారు.

అలా ప్రతి ఒక్కరు ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే దాకా ఎన్నో కర్మలు చేస్తూ ఉంటారు, కర్మలు చేయకుండా ఎవరూ ఉండరు. అలా చేస్తున్న కర్మలని ఏమంటారంటే "వర్తమాన కర్మలు" వీటినే "ఆగామి కర్మలు" అంటారు. ఇలా చేస్తున్న కర్మలలో ఎవరైనా సరే! "ఈ వర్తమాన కర్మల్లో అరవై శాతం ఈ జన్మలోనే వాటి ఫలితాన్ని అనుభవిస్తారు." ఈ జన్మలో మీరు దానాలు చేశారు, ఖచ్చితంగా దాని ఫలితంగా ఈ జన్మలోనే

ఆర్థిక లాభాలు పొందుతారు. ఈ జన్మలో దోచుకున్నారు, మోసగించారు, ఆర్థికంగా నష్టపరిచారు, ఈ జన్మలోనే మీరు నష్టాల పాలవుతారు. అందుచేత ఈ జన్మలో చేసినవి ఈ జన్మలోనే చాలామటుకు అనుభవించేస్తారని తెలుసుకోండి.

అలాగే చిన్ననాటి నుంచి ఈ జీవులని హింసించి, చంపి వాటి మాంసం తింటూ ఉంటారు. వాటి ఫలితం ఈ జన్మలోనే వయసు పెరిగాక కావచ్చు, వార్ధక్యం వచ్చాక కావచ్చు. ఆ రోగాలతో, ఆ బాధలతో, ఆ యాక్సిడెంట్లతో నరకాన్ని అనుభవిస్తూ ఉంటారు. చేసింది అనుభవించాలి, చాలా మటుకు ఈ జన్మలోనే ఎప్పుడో కాదు. ఇలా ఈ వర్తమానంలో మీరు చేసే కర్మల్ని వర్తమాన కర్మలు అంటారు, లేకపోతే ఆగామి కర్మలు అంటారు. ఇలా అనుభవించగా మిగిలిన కర్మలు ఉంటాయి. 30 – 40% ఉండొచ్చు. ఈ మిగిలిన కర్మలు మీరు చనిపోయిన తర్వాత ప్రతి ఒక్కరి పేరు మీద ఒక అకౌంట్ ఉంటుంది, దానిలో పడతాయి. దాన్నే మనకి పత్రిగారు "ఆకాశిక్ రికార్డ్స్" అని చెప్తారు.

హిందూ మతంలో, "చిత్రగుప్తుని చిట్టా" అంటారు. అందులో రికార్డు అయ్యి ఉంటాయి అంటారు. ప్రతి ఒక్కరికి ఒక అకౌంట్ ఉంటుంది, అందులో పడుతూ ఉంటాయి. అంటే ప్రతి ఒక్కరికి ఒక సంచి ఉంటుంది, ఆ సంచిలో పడుతూ ఉంటాయి. అలా ఆ సంచిలో పడిన, నిలువ ఉన్న కర్మలు అన్నిటిని ఏమంటారంటే "సంచిత కర్మలు" అంటారు. ఈ జన్మలో చేస్తున్న కర్మలు వర్తమాన కర్మలు. అందులో మిగిలినవి మన అకౌంట్ లో పడతాయి, అలా అకౌంట్ లో పడినవి సంచిత కర్మలు అంటారు.

మరలా వీళ్ళు జన్మ తీసుకునేటప్పుడు ఏం చేస్తూ ఉంటారంటే ఆ కర్మల్లో కొన్ని కర్మలు సెలెక్ట్ చేసుకుంటారు. అవి పాపమైనా కావచ్చు, పుణ్యమైనా కావచ్చు, అది వాళ్ళ ఇష్టం. అందులో ఎక్కువ పుణ్య కర్మలు ఉంటే పుణ్య కర్మలు సెలెక్ట్ చేసుకుంటారు, ఎక్కువ పాప కర్మలు ఉంటే ఇంక చేసేది ఏమి

లేదు కదా! అవే సెలెక్ట్ చేసుకోవాలి. అలా సెలెక్ట్ చేసుకుని జన్మ తీసుకుంటారు. అలా సెలెక్ట్ చేసుకుని ఎంచుకున్నటువంటి ఆ కర్మలనే ఏమంటారు అంటే "ప్రారబ్ధ కర్మలు" అంటారు. ఆ ప్రారబ్ధ కర్మలతోటే జన్మ తీసుకుని అనుభవిస్తూ ఉంటారు.

ఆ ఎంచుకున్న కర్మలను బట్టే మీజన్మ ఆధారపడి ఉంటుంది. అందులో మీరు ఇంతకుముందు దానాలు చేసినటువంటి పుణ్య కర్మలు ఎంచుకున్నారు అనుకోండి. అవన్నీ ఎంచుకోవడం వల్ల మీరు "పుట్టుకతోటే ధనవంతులు అవుతారు", ధనవంతులకే పుడతారు. అలాగే పుణ్యాలు, పుణ్య కార్యాలు చేయడం వల్ల మంచి భోగాలు అనుభవిస్తారు, చూసినవాళ్ళు ఎంతో అదృష్టవంతులు అనుకుంటారు. కాని అది మీరు గతంలో చేసుకున్నటువంటి పుణ్యాలే, దానాలే అంతకన్నా ఏం కాదు. దేవుడు స్పెషల్‌గా మీకు ఏమి వ్రాయలేదు. మీరు చేసుకున్నది, కోరుకుని తెచ్చుకున్నదే ఇప్పుడు మీరు అనుభవిస్తున్నారు.

చాలామంది తెలియక అదృష్టం అంటారు. అదృష్టం అన్న ఆ మాటలో కూడా అర్థం అదే. అంటే "దృష్టము అంటే కనిపించేది, అదృష్టము అంటే కనిపించనిది." కనిపించని సమయంలో మీరు చేసుకున్నటువంటి పుణ్యం ఇప్పుడు అనుభవించే సమయం వచ్చింది కాబట్టి అన్నీ కలిసి వస్తున్నాయి. అలాంటి వారికి ఇక్కడ ఏమి కష్టపడకపోయినా కలిసి వస్తుంది. చూడండి కోటీశ్వరుడి ఇంట్లో పుట్టారు, మీరు ఏం కష్టపడ్డారు? పుట్టగానే కోటీశ్వరుడు, పుట్టగానే కార్లో తిరుగుతాడు. పుట్టగానే గొప్ప గొప్ప భవంతుల్లో ఉంటాడు, ఎందుకు అంటే "అది గతంలో చేసుకున్నదే."

కానీ కొంతమంది పాపాలు, హింసలు చేసి వచ్చారు. బాగా మాంసం తిని వచ్చారు. ఆ కర్మలు ఎంచుకుంటే ఆ నరకం అనుభవించాలిగా! ఆ కోళ్ళకి, ఆ మేకలకి, ఆ చేపలకి ఇంతకుముందు నరకం చూపించాడు, దారుణంగా హింసించారు, ఎంతసేపు మీ ఆనందం చూసుకున్నారు కానీ

అవి పడే హింస, అవి పడే బాధ చూసుకోలేదు, మీ ఆనందమే చూసుకున్నారు, అదేమైపోతే మీకు ఏంటి? మీరు, మీ బంధువులు, మీ కుటుంబం, మీ స్నేహితులు అందరూ ఎంజాయ్ చేయాలి. మీ ఫంక్షన్ గురించి, పార్టీ గురించి వాటిని దారుణంగా చంపారు.

అందుకే మీ అకౌంట్లో ఆ కర్మలే ఉన్నాయి. ఏం చేస్తారు? భూమి మీదకి రావాలంటే అవే తీసుకోవాలి, అవే తీసుకుని భూమి మీదకి వస్తారు. ఎటువంటి జన్మ వస్తుంది? పుట్టుకతోనే కుష్టి రోగంతో పుట్టొచ్చు. పుట్టుకతోనే అంధుడు, పుట్టుకతోనే అంగవైకల్యం, పుట్టుకతోటే బుద్ధిమాంద్యం, మానసిక వికలాంగులు అంటారు. వెర్రి వాళ్ళు ఉంటారు, వయసు పెరుగుతుంది కానీ మనుషులు పెరగరు. ఇలాగ పుట్టుకతోనే ఉన్నవాళ్ళు ఎంతో మందిని మనం చూస్తున్నాం.

వీళ్ళంతా ఎవరు? గత జన్మల్లో విపరీతంగా హింస చేసిన వాళ్ళు, మాంస భక్షణ చేసిన వాళ్ళు, నాలుక రుచికి బానిస అయిన వాళ్ళు, తినకపోతే ఎలాగని అడిగిన వాళ్ళు, అసలు ఆ జంతువులు దేనికి ఉన్నాయి? మనకోసమే కదా అనేవాళ్ళు, వాటికి బాధ ఉంటుందని గ్రహించని వాళ్ళు, రక్త మాంసాలు అంటే ఇష్టపడేవాళ్ళు, లొట్టలు వేసేవాళ్ళు, రాక్షసుల లాంటి వాళ్ళు, రాక్షసత్వాన్ని ప్రదర్శించిన వాళ్ళు. ఆ కర్మలే తెచ్చుకుంటారు.

అవే ఎక్కువ తెచ్చుకుంటే చిన్నప్పటి నుంచే, కష్టాలు అనుభవిస్తూ ఉంటారు, మా బ్రతుకు ఇలా అయిపోయింది అంటారు, మేము ఎవరికీ అన్యాయం చేయలేదు, మా వల్ల ఎవరికీ నష్టం లేదు, నేను మంచిగానే ఉన్నాను, నాకే ఇలా కష్టాలు వస్తున్నాయి. దేవుడు ఎందుకో మాకు ఇలాంటి కష్టాలు పెట్టాడు, దేవుడికి దయలేదు, అని అంటూ ఉంటారు. దేవుడికి దయ లేదని ఇప్పుడు చెప్తున్నాడే! ఇంతకుముందు ఆ కోళ్ళ మీద, ఆ మేకల మీద, ఆ గొర్రెల మీద వీడికి దయ ఉందా?

దయ ఉంటే వాటిని అంత ఘోరంగా చంపుతారా? డబ్బు దేనికి

సంపాదించడం అనుభవించకపోతే ఎలా అంటూ మాట్లాడరే! అసలు దేవుడు ఎందుకు సృష్టించాడు? మా కోసమే కదా అని మాట్లాడరే? గిలగిలా రక్తంలో కొట్టుకుంటే మాట్లాడరే? వీడికి ఏదో కష్టం వచ్చిందని అమ్మవారికి మొక్కుకున్నా అంటూ ఒక బొమ్మ పెట్టి బలి ఇచ్చారే! పోనీలే! అది అమ్మవారా? వీడు తయారు చేసిన బొమ్మ. ఆ బొమ్మే అమ్మవారు అంటూ ఆ కోడిని, ఆ మేకల్ని దారుణంగా చంపుతారు. మీరు జాతరలలోకి, వెళ్ళి చూడండి, రక్తాలు ఏరులై పారుతాయి. ఆ రక్తాల మధ్యలో అవి గిలగిలా కొట్టుకుంటుంటే దారుణంగా కోస్తూ వాటిని వండుకొని తింటారు.

ఇంత ఘోరమైన పాపం చేస్తే మరి ఆ కర్మలే ఎంచుకోవాలి. ఏం చేస్తారు? భూమి మీదకి రావాలి, అక్కడ ఎన్నాళ్ళు ఉంటాడు? ఎన్ని వందల సంవత్సరాలు, వేల సంవత్సరాలు ఉంటాడు? ఇప్పుడైనా వెళ్ళి సరి చేసుకోరా నాయనా అని పైన చెపుతారు. అవి రద్దు చేసుకో, ఎంతోమంది ఎంతో గొప్ప స్థితికి ఎదిగారు, వాళ్ళలా తయారవ్వు అని పైన చెపుతారు.

తెచ్చుకున్న వాటిని బట్టే అలాంటి రాక్షస కుటుంబాల్లో అటువంటి తల్లులకి పుడతారు. చిన్నప్పటి నుంచి ఆ మాంసం తినిపించే తల్లులకు పుడతాడు. ఆతల్లులు వాళ్ళ చిన్నప్పటి నుంచే మాంసం తినడం నేర్పుతారు. అలా ఎన్నో జన్మలు అటువంటి కుటుంబాల్లో పుట్టడం, అలాంటి పనులు చేయడం మరల అలాంటి జన్మలు తీసుకోవడం, నరకం అనుభవించడం ఇదే పనీ వీడికి.

శ్రీకృష్ణుల వారు భగవద్గీతలో మాంసం తినే వాళ్ళందరి గురించి చెప్పారు.

అసుర యోనులు అంటే అసుర స్వభావం గల స్త్రీల యోనుల్లో జన్మ తీసుకుంటాడు అని కృష్ణుల వారు చెప్పడం జరిగింది. ఈ జీవహింస చేసేవాళ్ళు, మాంస భక్షణ చేసేవాళ్ళ జీవితాలు ఎన్నో జన్మలు అలా నరకం అనుభవిస్తారు. పుట్టినప్పటి నుంచి రోగాలు, నా బ్రతుకు ఎందుకు ఇలా

అయిపోయింది? నా రాత ఇలా అయిపోయింది అంటారు, భగవంతుడు నా వ్రాత ఇలా వ్రాశాడు అంటారు.

అది భగవంతుడు వ్రాసింది కాదు. నువ్వు చేసుకున్న కర్మలలో నుంచి నువ్వు కోరుకున్న కర్మలే నీ నుదుటన వ్రాయబడ్డాయి. అంతే తప్ప ఎవ్వరి ప్రమేయం అక్కడ ఉండదు, అంతా నీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. అలా మీరు నిర్ణయించుకొని తెచ్చుకున్న కర్మలే "ప్రారబ్ధ కర్మలు" అంటారు.

మీరు ఎంచుకున్న అటువంటి ప్రారబ్ధ కర్మల ఆధారంగానే ప్రస్తుత జన్మ తీసుకున్నారు. కష్టాలు అవ్వొచ్చు, సుఖాలు అవ్వొచ్చు, ధనం అవ్వొచ్చు, ధనం లేకపోవచ్చు, చిన్న కులం అవ్వొచ్చు, పెద్ద కులం అవ్వొచ్చు, ఏదైన అవ్వచ్చు. అన్నీ మీ ప్రారబ్ధ కర్మల ఆధారంగానే మీ ప్రస్తుత జన్మ. ఊరికే బాధపడి చాలామంది ఆ తల్లిదండ్రులని తిడతారు. వీళ్ళకి పుట్టడం వల్లే నా బ్రతుకు ఇలా అయిపోయింది, వాడికి పుట్టినా ఎంత బాగుండును. వాళ్ళ తల్లిదండ్రులు, వాడిని కార్లో తిప్పుతున్నారు. కనీసం నువ్వు నాకు సైకిల్ కూడా కొనలేదు అంటాడు. వీడికి ఏమీ లేకపోవడం అన్నది వాడి తల్లిదండ్రుల తప్పు అనుకుంటాడు. గుర్తుపెట్టుకోండి అది తల్లిదండ్రుల తప్పు కాదు, వీడు ఎంచుకున్న కర్మలను బట్టే వీడికి ఇలాంటి జన్మ వచ్చింది, ఇలాంటి తల్లిదండ్రులు దొరికారు.

ఇంతకుముందు వీడు ఏమన్నా గొప్ప పుణ్యాలు చేసినా, దానాలు చేసినా అలాంటి తల్లిదండ్రులు వాడికి లభించేవాళ్ళు. వీడు చేయకుండా ఎక్కడి నుంచి వస్తారు? ఇంక వీరి బ్రతుక్కి ఈ తల్లిదండ్రులే. ఇంతకన్నా ఎవరు వస్తారు? ఇంతకన్నా అధ్వాన్నంగా జీవించిన వాడికి ఇంతకన్నా అధ్వాన్నంగా అడుక్కునే వాళ్ళే తల్లిదండ్రులు అవుతారు. అందుచేత వాళ్ళ జీవితం ఇలా ఉండడానికి కారణం వాళ్ళ తల్లిదండ్రులు కాదు, వాళ్ళే దానికి కారణం.

తల్లిదండ్రులు తాగుడు తాగమన్నారా? పనికి రాని అలవాట్లు

చేసుకోమన్నారా? జీవితాన్ని నాశనం చేసుకోమన్నారా? నువ్వు చేయను అంటే వాళ్ళు ఏమంటారు? నేను హింస చేయను, నేను మాంసం తినను అంటే వాళ్ళు ఏం చేస్తారు? వాళ్ళకు ఉన్న జ్ఞాన పరిధిని బట్టి చెప్తారు, కానీ నీ బుద్ధిని ఉపయోగించి ఇవన్నీ నాకు అవసరం లేదు, నేను ఏ మేక జోలికి వెళ్ళను, ఏ కోడి జోలికి వెళ్ళను అంటే వాళ్ళు ఏం చేయగలరు? వాళ్ళు ఒత్తిడి చేశారు, వీళ్ళు ఒత్తిడి చేశారు అంటారు. ఏవండీ ఎవడైనా విషం తాగమని ఒత్తిడి చేస్తే త్రాగుతారా?

నీకు తినాలని ఉంది కాబట్టి ఒత్తిడి చేశాడు అంటున్నావు. నీకు తినాలని లేకపోతే నిన్ను ఎవ్వడు ఏం చేయగలడు? చంపేస్తారా? వాళ్ళేవరు నిన్ను ఒత్తిడి చేయడానికి. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని ఎంత ఒత్తిడి చేశాడు. ఎన్ని చేసినా నీ రకం జీవితం నాకు అక్కర్లేదు అన్నాడు. రాక్షస జీవితం నాకు అక్కరలేదు, నేను రాక్షసుడిగా మారదలుచుకోలేదు, నాకు ఆ నారాయణుడే కావాలన్నాడు అంటే ఆత్మే కావాలి అని ఆత్మ మీదే దృష్టి పెట్టాడు అంటే ఎప్పుడు ధ్యానంలోనే ఉండేవాడు. ఏం చేయగలిగాడు? తండ్రి తప్పు చెప్పాడు, చివరికి ఆయనే నాశనం అయ్యాడు. ప్రహ్లాదుడిని తప్పు దారిలో నడిపిద్దామని చూశాడు కానీ తానే నాశనమయ్యాడు.

పెద్దలు "తల్లిదండ్రుల" మాటలు వినాలి కదా అని చాలామంది అనుకుంటారు. ధర్మ మార్గాన్ని మీకు బోధిస్తే, ధర్మంగా మిమ్మల్ని జీవింపజేస్తే తల్లిదండ్రుల మాటలు వినొచ్చు. వాళ్ళు అధర్మం వైపు మిమ్మల్ని నడిపించడానికి ప్రయత్నం చేస్తే తల్లిదండ్రుల మాట వినవలసిన పనిలేదు, అదే మనకి పత్రిగారు చెప్తారు. హిరణ్యకశిపుడిని ఉదాహరణగా చెప్తూ ఉంటారు. తల్లిదండ్రులు అధర్మంగా ఇటువంటి హింసను ప్రోత్సహిస్తే వినవలసిన పని లేదు, మీరు వినకపోతే వాళ్ళు చేసేది ఏమీ లేదు.

అందుచేత మీ భవిష్యత్తు మీది, వాళ్ళు చేయమన్నారని పాపం చేస్తే వాళ్ళు అనుభవిస్తారా? మీరు అనుభవిస్తారా? ఆ నరకం వచ్చినప్పుడు

వాళ్ళు ఏం చేయగలరు? అయ్యో! అమ్మో! అది వచ్చిందా? ఇది వచ్చిందా? యాక్సిడెంట్ అయ్యిందా? ఈ జబ్బు వచ్చిందా? అని జాలి పడతారు, కానీ మీ బాధ తొలగించగలరా? తిను అని చెప్పడం చెప్తారు. అందుచేత ఏ కర్మలు అయితే అక్కడ మీ అకౌంట్ లో ఉన్నాయో వాటిని మీరు ఎంచుకొని వచ్చిన ప్రారబ్ధ కర్మలు ఆధారంగానే మీరు ప్రస్తుత జన్మ తీసుకున్నారు.

ఇక్కడ ఎవరి ప్రమేయం లేదు, మీ జన్మ ఇలా ఉండడానికి ఎవ్వరూ కారణం కాదు, మీ జన్మకి మీరే కారణం. అదే మాణికేశ్వరి మాత చెప్పినటువంటి సందేశం. ఈ ఒక్క పదంలో ఎంత అర్థం ఉందో ఒక్కసారి అర్థం చేసుకోండి. మరి మీరు ఏం చేస్తారు? అవే ఉన్నాయి, అవే తెచ్చుకున్నారు. తెచ్చుకున్నాక చూస్తే కష్టాలే వుంటాయి. ఓ కష్టం పోకుండానే ఇంకో కష్టం, దాని తర్వాత ఇంకో కష్టం ఇలా వస్తాయి. అంతా అయోమయంగా ఉంటుంది, ఏంటో అర్థం కాదు, సడన్ గా వస్తుంది అంటారు.

కారణం తెలియదు, నిన్నటిదాకా బాగానే ఉన్నారు ఒక్కసారిగా మారిపోయింది. అప్పటిదాకా బాగానే బైక్ మీద తిరుగుతున్నాడు. ఎందుకో ఇంట్లో నుంచి అలా బయటకి వెళ్ళాడు, కారు గుద్దేసింది, కాళ్ళు, చేతులు విరిగిపోయాయి, ఆశ్చర్యపోయి చెప్పుకుంటారు. ఇప్పుడేరా వెళ్ళాడు, ఇప్పుడేరా మాట్లాడాడు అంటారు. ఆ టైం వచ్చేసరికి ఎవ్వడు ఏం చేయలేడు, దాన్ని ఆపలేడు. వాడు తెచ్చుకున్నాడు, ఆ టైం లో అనుభవించాలి, ఖచ్చితంగా అనుభవించి తీరుతాడు.

ఎవ్వరూ సృష్టి నిర్ణయాన్ని, ప్రకృతి నిర్ణయాన్ని, భగవంతుని నిర్ణయాన్ని అధిగమించలేరు, తప్పించుకోలేరు. వాడు ఎంత మేధావైనా, ఎంతైనా సరే. ఒంటి స్తంభం మేడమీద చుట్టూ రక్షణ కల్పించుకుని కూర్చుంటే మరి పాముకాటుకు చనిపోలేదా? ఎవరు తప్పించుకోలేరు, కచ్చితంగా అది ప్రకృతి నిర్ణయం.

కొంతమంది ఏం చేస్తారంటే ఇలా బయటికి వెళ్తుంటే యాక్సిడెంట్లు

అవుతున్నాయి, జాగ్రత్తగా ఉండాలి అని ఇంట్లోనే ఉంటే బాత్‌రూమ్‌లో జారిపడి ఎముకలు విరగ్గొట్టుకుంటారు, అలా ఎంతోమంది ఉన్నారు. బాత్ రూమ్ లో జారిపడి నడుం విరగ్గొట్టుకున్న వాళ్ళు ఉన్నారు, తలకి దెబ్బలు తిన్నవాళ్ళు ఉన్నారు, ఇలా ఎన్నో రకాలుగా దెబ్బ తిన్నవాళ్ళు ఉన్నారు.

మరి జాగ్రత్తగానే ఉన్నాడుగా! జారిపోయింది అంటాడు. ఇన్ని సంవత్సరాల నుంచి జారనిది ఇప్పుడే ఎందుకు జారింది? వాడి కర్మ నెత్తి మీద పడింది, అందుచేత ఆ రకమైనటువంటి స్థితి వాడికి కలిగింది. ప్రకృతిని తప్పించుకోవడం ఆషామాషి కాదు. అది మాయ కమ్మినట్టు కమ్మేస్తుంది. పైనుంచి పడిపోతారు, సడన్ గా అయిపోతుంది. కిడ్నీ ఫెయిల్యూర్ అయిపోతుంది, హార్ట్ డామేజ్ అయిపోతుంది, లివర్ పని చేయదు. ఇలా ఎన్నో రకాలు.

అబ్బే! నేను జాగ్రత్తగానే ఉంటాను, జాగ్రత్తగానే తింటాను అంటారు. ఎన్ని జాగ్రత్తగా తిన్నా ఆ కర్మ అనుభవించవలసిన టైం వచ్చేసరికి ఈ జాగ్రత్తలు ఏమి పని చేయవు. అందుచేత గుర్తుపెట్టుకోండి. మీ ప్రారబ్ధ కర్మల ఆధారంగానే ప్రస్తుత జన్మ తీసుకున్నారు అన్న సంగతి మర్చిపోకూడదు. మీ భోగము దేవుడి దయ కాదు, మీరు చేసుకున్న పుణ్య కర్మలే! రోగాలు దేవుడు దయ లేకపోవడం కాదు మీరు చేసుకున్న పాప కర్మలే!

భరించలేకపోతున్నాను, అనుభవించలేకపోతున్నాను, బయటపడడం ఎలాగా అని సహజంగా అడుగుతారు. ఆ రోగాలు వచ్చినప్పుడు, ఆ బాధలు కలిగినప్పుడు, ఆ సమస్యలు ఉన్నప్పుడు, ఆ ఇంట్లో ఆ గొడవలు ఉన్నప్పుడు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పుడు ఏం చేయమంటారు అని సహజంగా అడుగుతారు. ఈ గురువులు, స్వామీజీలు, బాబాలు ఇటువంటి వాళ్ళని ఎంతోమంది క్యాష్ చేసుకుంటున్నారు, ఆ బలహీనత ఉన్నవాళ్ళని ఆర్థికంగా ఇంకా ఎన్నో రకాలుగా దోచుకుంటున్నారు. అదే స్త్రీలని అయితే వాళ్ళని ఎన్నో రకాలుగా వాడుకుంటారు.

ఆ మధ్యే మదనపల్లిలో ఓ గురువు మాటలు విని తల్లిదండ్రులు సొంత కూతుళ్ళను ఇద్దరిని చంపేశారు, అంత మూఢత్వంలో పడిపోతున్నారు. అలాగే ఎంతో మందిని తన్నుడుబాబా తంతాడు, ముద్దులుబాబా ముద్దులు పెట్టుకుంటాడట, కొరుకుడు బాబా కొరుకుతాడట, తొక్కుడు బాబా, డాన్సింగ్ బాబా అన్ని ఉన్నారు. ఈ వీడియోలు చూస్తే మీకు ఫేస్ బుక్ లో ఉన్నాయి, వాట్సాప్ లో వస్తున్నాయి.

ఇలా రకరకాలుగా ఆ బలహీనతతో వెళ్తారు. క్రిస్టియన్లు అయితే ఆ ఫాదర్ల దగ్గరికి వెళ్తారు. ఈ పండితుల దగ్గరికి, బాబాల దగ్గరికి హిందువులు వెళ్తారు. ఆ ఫాదర్లు ఎంతోమంది అమాయకులైన వాళ్ళని, ఆ స్త్రీలని దారుణంగా వాళ్ళ బలహీనతను ఆధారంగా చేసుకుని అనుభవిస్తున్నారు. అన్ని చూస్తున్నాం, బయట పడడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని తిప్పలు పడినా అనుభవించక తప్పదు. గుర్తుపెట్టుకోండి చేసిన పాపం అనుభవించి తీరవలసిందే.

తప్పించుకోవడం ఎవ్వరి వల్లా సాధ్యం కాదు, ఎంతటి వాడికైనా సాధ్యం కాదు. ఎవరికైనా మహా మహా మహిమలు ఉండి గొప్ప స్థాయికి ఎదిగినా కూడా ఒక శిరిడీ బాబాలాగా అయినా సరే! ఎవరిదైనా తగ్గిస్తే ఆయన అనుభవించాలి. ఆ కష్టాన్ని, ఆ కర్మని ఆయన మీద వేసుకుంటే గానీ తగ్గదు. అలా మీరు బాబా సత్ చరిత్రలో చూస్తూనే ఉన్నారు. ఒక భక్తుడికి దగ్గు తగ్గిస్తే మసీదులో ఆయన దగ్గుతూ కనిపించాడు, చూస్తున్నాం కదా? ఈ మామూలు బాబాలు తీసుకోవడమే సాధ్యం కాదు, ఇంకేం చేయగలరు? కానీ మాణికేశ్వరి మాత ఇలాంటి వాళ్ళందరికీ పరిష్కారం సూచించారు.

పత్రిగారు కూడా చాలామంది చేత అదే చేయిస్తున్నారు. మాణికేశ్వరి మాత ఏమన్నారంటే "ఇతరులకు మంచి చేయడం ద్వారా వర్తమానంలో వాటి చెడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు అన్నారు."

బాగా గుర్తుపెట్టుకోండి, చాలా జాగ్రత్తగా ఆలోచించండి! చాలామంది ఎలాగండి, ఎలాగండి అని అడుగుతారు. ఆరోగ్యపరమైన, రోగపరమైన బాధలన్నిటికీ కారణం గతంలో మీరు చేసిన హింసే.

దాంట్లోనుంచి బయట పడాలి అంటే కనీసం దాని ప్రభావాన్ని తగ్గించుకోవాలంటే, దాని ఉద్భృతిని తగ్గించుకోవాలి అంటే ఇప్పటి నుంచైనా అలాంటి పని మానేసి, అటువంటి హింస మానేసి, ఆ మాంసం తినడం మానేసి, కుటుంబం అంతా మానేసి, ఎన్నింటిని హింసించి చంపారో! అన్నిటి జీవితాలు బాగు చేయడానికి, అన్ని జీవుల యొక్క ప్రాణం నిలబెట్టే ప్రయత్నం చేయాలి. అంటే ఎంత మాంసం తిన్నారో అంతమంది చేత మాంసం తినడం మాన్పించండి.

ఎన్ని కోళ్ళు తిన్నారో అన్నిటికీ అన్ని రెట్లు కోళ్ళని బ్రతికించండి. అంటే వాళ్ళ చేత మాంసం తినడం మీరు మాన్పిస్తే ఆ కోళ్ళన్నీ బ్రతికినట్టే, ఆ మేకలన్నీ బ్రతికినట్టే. లేకపోతే అవి చనిపోతాయి. అవి చనిపోకుండా వాటి ప్రాణం రక్షించారు, ఎవరు అంటే మీరు చేయడం వల్ల, అవి ఎందుకు ఇంతకుముందు చనిపోయాయి అంటే మీరు తినడం వల్ల. ఆ పాపం యొక్క ఒత్తిడి మీరు తగ్గించుకోవాలి అంటే దాని ప్రభావం తగ్గించాలి అంటే కనీసం ఇప్పుడైనా మీరు చేయండి, ఆ జీవులకి మంచి చేయండి.

మీరు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. రైటే! ఉన్నంతలో దానం చేయండి, ఆర్థిక ఇబ్బందులనుండి బయట పడతారు. ఇదే మాణిక్యేశ్వరి మాత చెప్పింది.

## “కేవలం భౌతిక సుఖాలు, సంతోషాల వెనుక అధికంగా పరుగులు తీయకండి. అది మిమ్మల్ని జనన మరణ చక్రంలో పడవేస్తాయి.”

ఇక్కడ ఆవిడ ఏమన్నారంటే భౌతిక సుఖాలు, సంతోషాలు వాటి వెనక పడొద్దు అన్నారు. భౌతిక అంటే “ఈ ప్రపంచంలో ఉన్నటువంటి సుఖాలు, సంతోషాలు వాటి వెనక పడొద్దు అన్నారు.”

అసలు సుఖం, సంతోషము అంటే కొంచెం తెలుసుకుందాము. చాలామంది సుఖపడకపోతే ఎలా? సుఖపడాలి కదా? అంటారు. అసలు డబ్బు సంపాదించేది సుఖపడడం కోసమే కదా? అంటారు చూడండి సుఖము వేరు, సంతోషము వేరు.

మీ **“ఇంద్రియాల ద్వారా మనసుకు కలిగించే తృప్తిని సుఖము అంటారు”.** అలాగే **“ఇంద్రియాల ప్రమేయం లేకుండా మనసుకు కలిగే తృప్తిని సంతోషం అంటారు”.** మీకు ఐదు ఇంద్రియాలు ఉన్నాయి. అవి కళ్ళు, ముక్కు నోరు, చెవులు, చర్మం. వీటి ద్వారా మనసుకు తృప్తి కలిగిస్తే దాన్ని సుఖము అంటారు.

ఒకడు సుఖపడాలని బాగా సంపాదించాడు, బిల్డింగ్ కట్టాడు. ఇంటిని బాగా డెకరేషన్ చేశాడు, పెద్ద రూమ్ తయారు చేసుకున్నాడు. రూమ్ లో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నాడు, పెద్ద స్క్రీన్ ఉన్న టీవీ పెట్టాడు, సినిమా చూస్తాడు. అది కళ్ళకి సుఖము, ఆ గదిలోనే మంచి సౌండ్ సిస్టమ్ పెట్టుకుని మ్యూజిక్ వింటున్నాడు, అది చెవులకు సుఖము. ఆ గదిలోనే అగరవత్తులు వెలిగించి దాని సువాసన గ్రహిస్తున్నాడు, అది ముక్కుకి సుఖం. అలాగే ఆ గదిలో ఏసి పెట్టి, పెద్ద పరుపు వేసి దానిమీద పడుకున్నాడు. అది చర్మానికి సుఖము. అలాగే ఆ గదిలోనే డబ్బాల్లో స్వీట్లు, హాట్లు ఉన్నాయి, అవి నోటికి సుఖము.

ఇలా ఐదు రకాల సుఖాలు ఉంటాయి. ఇంకా అంతకన్నా ఏమీ లేవు కారణం మానవుడికి భగవంతుడి చేత ఐదు రకాల ఇంద్రియాలే ఇవ్వబడ్డాయి. ఈ ఐదు రకాల ఇంద్రియాల ద్వారా మానవుడు సుఖం అనుభవిస్తున్నాడు.

చూడండి మీరు మామిడికాయలు చూసారు, అవి చూడగానే నోట్లో లాలాజలం ఊరుతుంది. చూడండి లాలాజలం ఊరిన నోరు మామిడికాయలు చూసిందా? నోరు చూడగలదా? అంటే చూడలేదు కానీ నోట్లో నుంచి లాలాజలం ఊరింది. అలాగే కళ్ళు చూసాయి కానీ కంట్లో నుంచి నీళ్ళు కారాయా? అంటే లేదు. చూడని నోట్లో నుంచి కారాయి, కారణం కళ్ళ ద్వారా చూసింది మనసే, దానికి రియాక్షను నోటి ద్వారా చూపించింది మనసే.

అందుచేత ఇది అర్థం చేసుకుంటే తెలుస్తుంది. ఈ ఇంద్రియాల ద్వారా తృప్తి కలిగేది మనసుకి. సుఖము అంటే ఇంద్రియాల ద్వారా మనసుకు కలిగే తృప్తిని సుఖము అంటారు.

అలాగే ఇంద్రియాల ప్రమేయం లేకుండా మనసుకు కలిగే తృప్తిని సంతోషం అంటారు.

ఒకడు ఫస్ట్ లో పాస్ అవ్వాలి అనుకుంటాడు. పాస్ అయ్యాడు, చాలా సంతోషంగా ఉంది, ఫస్ట్ లో పాస్ అయ్యాను అంటూ అందరికీ చెప్తాడు. తర్వాత ఉద్యోగం రావాలి అనుకుంటాడు, ఉద్యోగం వచ్చింది మళ్ళీ అందరికీ నాకు చాలా సంతోషంగా ఉంది అని చెప్తాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లి చేసుకోవాలి అనుకుంటాడు, వాడికి మంచి సంబంధం కుదిరింది. ఎప్పుడైతే మంచి సంబంధం కుదిరిందో మళ్ళీ నాకు చాలా సంతోషంగా ఉంది అంటాడు.

తర్వాత పిల్లలు పుడితే బాగుండు అనుకుంటాడు, అలాగే అబ్బాయి పుట్టాడు. అప్పుడు చాలా సంతోషంగా ఉంది అని మళ్ళీ అంటాడు. చూస్తే ఇక్కడ ఇంద్రియాల ప్రమేయం ఏమీ లేదు. అలా ఇంద్రియాల ప్రమేయం

లేకుండా  మనసుకు తృప్తిని కలిగించడమే సంతోషం అంటారు.

లోకంలో ఇప్పుడు అంతా ఈ రెండింటి వెనకే పరిగెడుతున్నారు. ఈ రెండింటి గురించే ఆలోచిస్తున్నారు, ఇవన్నీ శారీరక సంబంధమైనవి.  ఈ శరీర సంబంధమైన సుఖాలు, సంతోషాలు.  మనసు, శరీరానికి సంబంధించినవి. శరీరంతో పాటు వస్తాయి, శరీరంతో పాటు పోతాయి. ప్రతి ఒక్కరు ఈ రెండింటి కోసమే  చూస్తున్నారు,  అంతకన్నా ఏముంది అంటారు.

వాటికోసం ముఖ్యంగా కావలసింది డబ్బు. అందుచేత డబ్బు సంపాదనకి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఎవరిని చూసినా  ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే దాకా ఎక్కువ సమయం  "డబ్బు సంపాదనకే" కేటాయిస్తున్నారు.

అంతేకాదు డబ్బు సంపాదించడానికి చెయ్యకూడని పనులు చేస్తున్నారు, తప్పులు చేస్తున్నారు, పాపాలు చేస్తున్నారు, అధర్మంగా వ్యవహరిస్తున్నారు.  అన్యాయంగా, అక్రమంగా కూడా ప్రవర్తిస్తున్నారు. ఎవరిని చూసినా ఎంత సంపాదించాను అన్న దాని మీదే దృష్టి పెడుతున్నారు కానీ ఎలా సంపాదించాను అన్న దానిమీద ఎవరు దృష్టి పెట్టడం లేదు.

కానీ నిజంగా ఆలోచించవలసింది ఎంత సంపాదించాను అన్నది కాదు, ఎలా సంపాదించాను అన్నది చూసుకోవాలి.   ఎంత సంపాదించినా అన్యాయంగా, అక్రమంగా, అధర్మంగా పాపాలు చేసి సంపాదించడం వలన ఆ పాప ఫలితము కష్టాల రూపంలో అనుభవించాల్సి వస్తుంది.

అప్పుడు ఆ సుఖాలు ఉన్నా అనుభవించ లేకపోతాడు.  మీకు చిన్న ఉదాహరణ..  ఒకాయన అన్ని సమకూర్చుకున్నాడు,  బ్రహ్మాండంగా గొప్ప డెకరేషన్లు చేశాడు, ఏసీలు బిగించాడు, ఇంత లావు పరుపు వేసాడు. హాయిగా పడుకుందాం అనుకున్నాడు, వీడికి 'మైగ్రేన్ హెడేక్' వచ్చింది,  అంత తలనొప్పి ఉంటే నిద్ర ఏం పడుతుంది చెప్పండి.  ఎలా పడుకోగలడు చెప్పండి?  వాడికి

నిద్ర పట్టదు, పడుకోలేడు. అప్పుడు అనుకుంటాడు, ఇవన్నీ ఎందుకు? నిద్ర పట్టనిదానికి, తల నొప్పి లేకుండా ఉంటే బాగుండు అనుకుంటాడు.

కిటికీలోంచి చూస్తే దూరంగా ఎవడో చెట్టు కింద హాయిగా పడుకున్న వాడిని చూస్తాడు. అరే! నాకంటే వాడే అదృష్టవంతుడు, ఇన్ని ఉన్నా నాకు నిద్ర పట్టడం లేదు, ఏమీ లేకపోయినా వాడు హాయిగా నిద్రపోతున్నాడు, అనుకుంటాడు. అందుచేత అన్ని ఉన్నవాడు అదృష్టవంతుడు కాదు, అనుభవించే వాడే అదృష్టవంతుడు అని తెలుసుకోవాలి.

ఒకడు ఒక స్వీట్ కూడా తయారు చేసుకోలేకపోయేవాడు. కష్టపడ్డాడు, బాగా సంపాదించాడు, పది స్వీట్స్ తయారు చేసుకోగలిగే స్థాయికి ఎదిగాడు. పది రకాల స్వీట్స్ తయారు చేశారు, కానీ వీడికి షుగర్ వ్యాధి వచ్చింది, చూడండి పది రకాల స్వీట్స్ ఉన్నా తినలేడు, తినమంటే భయపడి పోతాడు. అవి చూస్తూ లొట్టలు వేస్తూ తినలేక పోతున్నాను అని బాధపడుతూ ఉంటాడు.

అందుచేత ఈ సుఖాల వెనకాల పరిగెడుతూ ఆ సుఖాలు గొప్పవి అనుకుంటూ వాటికోసం చేయకూడని పనులు చేస్తూ, అడ్డంగా అన్యాయంగా, అక్రమంగా సంపాదిస్తే వాటి ఫలితంగా ఎన్ని సుఖాలు ఉన్నా "అనుభవించే యోగ్యత" ఉండదు, ఇలా ఎంతోమంది ఉన్నారు. చూస్తే ధనవంతులకే అనుభవించే యోగ్యత లేదు, కారణం ఆ ధనం సంపాదించడం కోసం వీళ్ళు చేయకూడని పనులు చేయడమే, అధర్మంగా వ్యవహరించడమే. గమనిస్తే సంపాదన అంతా వృధా అయినట్టేగా? వారికి ఎందుకు ఈ జీవితం అనే పరిస్థితి వస్తుంది.

అందుచేత మాణికేశ్వరి మాత "కేవలం భౌతిక సుఖాల వెనక అధికంగా పరుగులు తీయకండి." అన్నారు.

అంటే అన్యాయాలు, అక్రమాలు, అధర్మాలు చేయకండి, ధర్మంగా సంపాదించుకోండి, ఉన్నదానితో తృప్తిగా జీవించండి అనే దీని అర్థం.

ఎందుకంటే మీరు చేయవలసినవి చాలా ఉన్నాయి. అందుచేత వాటి గురించి కూడా కొంచెం ఆలోచించండి? ఈ సుఖాలు అశాశ్వతం, అవే మానవ జీవిత లక్ష్యం అనుకోవద్దు. వాటి వెనకాల పరుగులు తీయొద్దు అనే ఆవిడ చెప్పేది. పత్రిగారు కూడా అదే చెప్పారు. ఉన్నంతలో అనుభవించండి, లేకపోతే దాని గురించి ఆలోచించకండి.

ఎంత ఉంటే అంతే అనుభవించండి, ప్రక్క వాడిని చూసి మీరు పోటీ పడవద్దు, వాడికి ఉందని మీరు బాధపడొద్దు, అసూయ పడొద్దు, వాడిలా అవ్వాలని తప్పులు, పాపాలు చేయొద్దు. ఇదే పెద్దలు చెప్పేది, పత్రి గారు కూడా చెప్పేది. ఈ శారీరక సుఖాలు అన్నవి తాత్కాలికమైనవి, వాటికోసం పరుగులు పెట్టొద్దు, అని మాణిక్యేశ్వరి మాత చెప్తున్నారు.

చూడండి ఏదో కష్టపడి కారు కొన్నాడు. అది కూడా కొన్నాళ్ళ తర్వాత సంతోషాన్ని ఇవ్వదు. అలాగే పెళ్ళి కానప్పుడు పెళ్ళి అంటాడు, పెళ్ళి అయిన తర్వాత పిల్లలు అంటాడు, పిల్లలు పుట్టినా మళ్ళీ వాళ్ళ చదువులు అంటాడు, స్కూల్స్ లో మంచి సీట్ రావాలి అంటాడు. సీటు వచ్చాక వాళ్ళకి మంచి ఉద్యోగాలు అంటాడు.

ఇలా ఏది వచ్చినా ముందు సంతోషంగా ఉంటుంది కానీ అది ఎంతో కాలం నిలబడదు. కారణం ఇవి తాత్కాలికమైనవి. ఈ తాత్కాలికమైన సుఖ,సంతోషాలు గురించి పరుగులు పెట్టకూడదు అని మాణిక్యేశ్వరి మాత అన్నారు. ఇలాంటివి మిమ్మల్ని "జనన మరణ చక్రంలో" పడేస్తాయి. అంటే జన్మిస్తూ ఉంటాడు, మరణిస్తూ ఉంటాడు, మళ్ళీ జన్మిస్తూ ఉంటాడు మళ్ళీ మరణిస్తూ ఉంటాడు, ఇదే పని.

ఏమవుతుంది? చూస్తున్నాం కదా! జన్మించి ఎన్ని దుఃఖాలు పడాలి. ఆ దుఃఖాలు పడుతున్నప్పుడు చచ్చిపోతే మంచిది అనుకుంటారు. పోనీ చచ్చిపోతే అక్కడితో అయిపోయిందా? అంటే అవ్వదు, మళ్ళీ భూమి మీదికి వస్తారు. ఇలా చనిపోవడం, పుట్టడము మళ్ళీ చనిపోవడం మళ్ళీ పుట్టడం

ఎందుకు అని మాణిక్యేశ్వరి మాత యొక్క ఉద్దేశ్యం. ఆవిడ చావు పుట్టుకలు లేని జీవితం కోసం ప్రయత్నించాలి అంటారు.

ఇది ఆషామాషీ కాదు, ప్రతి జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొంతమంది మేము ఏ లోటు లేకుండా జీవిస్తున్నాం, మా జీవితం ఎంతో బాగుంది, మా పిల్లల జీవితం బాగుంది. మాకే ఆర్థిక ఇబ్బందులు లేవు, మాకు అన్ని సవ్యంగా ఉన్నాయి, ఇలా వెళ్ళిపోతే చాలు అంటారు. సరే వెళ్ళిపోతారు, వెళ్ళిపోయి మరల రాకుండా ఉంటే పర్వాలేదు కానీ గోడకు కొట్టిన బంతిలా మళ్ళీ వస్తారే. వస్తే అన్ని మామూలేగా!

పుట్టిన వాడికి "ఈతి బాధలు" తప్పవు. అంటే ప్రాతఃకాలం మలమూత్ర బాధ, మధ్యాహ్నం ఆకలి బాధ, సాయంత్రం కామ బాధ, రాత్రి నిద్ర బాధ. ఏది లేకపోయినా మానవుడికి చాలా ఇబ్బందే.

అంతేకాదు త్రివిధ దుఃఖాలు మానవుడిని హింసిస్తూ ఉంటాయి. అంటే "ఆది భౌతికము, ఆది ఆధ్యాత్మికము, ఆది దైవికము." ఈ మూడు రకాలైనటువంటి దుఃఖాలు జన్మ ఉంటే ఇవన్నీ తప్పవు. ఇలాంటి జీవితం కాదు మీకు కావాల్సింది. చావు పుట్టుకలు లేని జీవితం కోసం ప్రయత్నం చేయాలి అంటారు మాణిక్యేశ్వరి మాత.

ఈ జనన మరణ చక్రంలో ఎందుకు పడుతున్నావు? ఈ చావు పుట్టుకలు ఎందుకు వస్తున్నాయి? చనిపోయిన వాడు ఎందుకు వస్తున్నాడు అంటే వాడి ఖాతాలో కర్మలు ఉండడం వలన. ఎన్నాళ్ళు వాడి అకౌంట్లో కర్మలు ఉంటాయో! అన్నాళ్ళు జన్మలు తీసుకుంటూనే ఉండాలి. చెడు కర్మలు ఉంటే దుఃఖం ఎక్కువ ఉంటుంది. మంచి కర్మలు ఉంటే కొంచెం బాగా ఉంటుంది కానీ ఆ కర్మలు ఉన్నంతకాలం మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవాల్సిందే.

కర్మలు లేని స్థితికి చేరుకోవాలి. మరి కర్మలు లేని స్థితి ఎలా వస్తుంది అంటే ఎవరైతే భూమి మీద జీవించి ఉన్నప్పుడు ఆ దేహంతో ధ్యాన సాధన, స్వాధ్యాయ సాధన, సాంగత్య సాధన... ఈ మూడు చేస్తారో వాళ్ళకి అపారంగా

జ్ఞానం పెరుగుతుంది, ఈ జ్ఞానం అగ్నిలా ప్రజ్వరిల్లినప్పుడు వాడి కర్మలన్నీ దగ్ధమైపోతాయి, ఎప్పుడైతే కర్మలు ఉండవో వాళ్ళు ఇంక జన్మించవలసిన పనిలేదు.

అందుకే పత్రిగారు "ధ్యానం వల్లనే జ్ఞానం. జ్ఞానం వల్లనే కర్మ రహితం. కర్మ రహితం వల్లనే ముక్తి అంటారు" అంటే జన్మలేని స్థితి వస్తుంది.

అందుచేత మాణిక్యేశ్వరి మాత ఏమంటున్నారంటే "భౌతిక సుఖాలు, సంతోషాలు వెనుక పడవద్దు అంటున్నారు.

వశిష్టుల వారు కూడా "ఈ ప్రపంచంలో సుఖాలు గోరంత – దుఃఖాలు కొండంత" అన్నారు. అందుచేత ఈ గోరంత సుఖాల కోసం కొండంత దుఃఖాలు అనుభవించడం దేనికి? వీటి నుంచి బయటపడే ప్రయత్నం చేయండి అని ఆయన చెప్పారు. అదే మాణికేశ్వరి మాత చెప్తున్నారు. వీటి వెనక అధికంగా పరిగెత్తొద్దు, సుఖాలు అనుభవించండి, సంతోషంగా జీవించండి, సంసారం చేసుకోండి, సంసార సుఖాలు అనుభవించండి కానీ వాటి కోసం చేయకూడని పనులు చేయకండి అనే ఆవిడ చెప్పేది.

వాటితో పాటు ఈ జీవితం నుంచి బయటపడే ప్రయత్నం చేయాలి. ఎలా అంటే "కర్మలు లేకుండా చేసుకున్నప్పుడు." కర్మలు లేని స్థితి ఎప్పుడు వస్తుంది? ఈ "జ్ఞానము అగ్నిలా ప్రజ్వరిల్లినప్పుడు". మరి అగ్నిలా ఎప్పుడు ప్రజ్వరిల్లుతుంది? శంకరాచార్యులు వారు చెప్పినట్టు, వశిష్టుల వారు చెప్పినట్టు, పత్రిగారు చెప్పినట్టు "ఆధ్యాత్మిక త్రిరత్నాలు" అంటే సాధన, స్వాధ్యాయం, సాంగత్యం చేసినప్పుడు.

సాధన అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. అంటే గైడింగ్ కాదు, మ్యూజిక్ కాదు, ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని పత్రి గారు స్పష్టంగా చెప్పారు.

అలాగే జ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలి. అంటే దేహ సంబంధమైన, మానసిక సంబంధమైన పుస్తకాలు కాదు, ఆత్మకు సంబంధించి,

ఆత్మ జ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు  అధ్యయనం చేయాలి.

అంతేకాదు అటువంటి జ్ఞానాన్ని బోధించే వారి సాంగత్యం చేయాలి. ఈ మూడు ఎవరు చేస్తారో అప్పుడు వారు మెల్లిమెల్లిగా జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానం  అగ్నిలా ప్రజ్వరిల్లచేసుకుంటే ఆ జ్ఞానాగ్నిలో కర్మలన్నీ దగ్ధం అవడం వల్ల జన్మ లేకుండా ఉంటుంది.  అందుచేత **"జన్మ అనుభవించడం కోసం కాదు, జన్మ లేకుండా చేసుకోవడం కోసమే జన్మ".**  ఏ మహానుభావుడు చెప్పినా, గొప్పవాడు చెప్పినా అదే చెప్తున్నాడు.  మనల్ని జనన మరణ చక్రంలో పడవేసే ఈ సుఖాలు, సంతోషాలు వాటి వెనకాల పరుగులు పెట్టకూడదు అని.

ఉన్నంతలో అనుభవించండి, వద్దని ఎవరు చెప్పరు. కాని మీరు ఈ సుఖాల వెనకాల ఎంత పరిగెత్తకుండా ఉంటూ, ఈ మూడు ఆధ్యాత్మిక త్రిరత్నాలు పాటిస్తారో మీరు జ్ఞానం అపారంగా పెంచుకుంటారు.


## తటవర్తి దంపతుల Zoom  కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D.  :2413823868,  Password  : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే  TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links  మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# భౌతిక శరీరాన్ని బహుమతిగా భావించండి

**"మీ భౌతిక శరీరాన్ని మీకు ఇవ్వబడిన బహుమతిగా భావించండి, దానిని పనికిరాని పనులకు ఉపయోగించకండి, మీకు అంటే ఆత్మకు లాభం కలిగించే పనులు చేయించండి"** అని మాణిక్యేశ్వరి మాత సందేశం.

మీకు అంటే మీరు ఆత్మలు అంటే ఈ దేహం మీరు కాదు అని తెలుసుకోవాలి. అందుచేత ఆత్మకు లాభం కలిగించే పనులు చేయాలి, అప్పుడు మీరు ఎంతో లాభం పొందుతారు. అని మాణిక్యేశ్వరి మాత చెప్పారు.

అందుచేత ఈ జనన మరణ చక్రంలో మీరు పడకుండా ఉండాలి అంటే ఈ శరీరంతో పత్రిగారు చెప్పినటువంటి నాలుగు పనులు చెయ్యాలి. ఆయనతో పరిచయమైనప్పటి నుంచి మేము అవే చేస్తున్నాం. మాకు 23 సంవత్సరాల క్రితం పత్రిగారు పరిచయమయ్యారు, అప్పుడు ఇది అర్థం చేసుకున్నాము. పత్రి గారు చెప్పినటువంటివన్నీ చేస్తున్నాం, ధ్యానం చేస్తున్నాం, పుస్తకాలు చదువుతున్నాం, పత్రిగారు, ఇంకా గొప్ప గొప్పవారి సందేశాలు వింటున్నాం. వాటితోపాటు ఈ మార్గంలో సేవ చేస్తూ ఆయన చెప్పినటువంటి నాలుగు పాటిస్తున్నాం.

సేవ అంటే మనం తెలుసుకున్న ఈ గొప్ప మార్గాన్ని, జ్ఞాన మార్గాన్ని, ముక్తి మార్గాన్ని, ఆనంద మార్గాన్ని, సత్యమార్గాన్ని అందరికీ బోధిస్తున్నాం. అలాగే భీమవరంలో ఈ జ్ఞానాన్ని బోధించడానికి మూడు రోజుల క్లాసులు నిర్వహిస్తున్నాం. అవి నిర్వహిస్తూ అక్కడ ఉండడానికి వసతి, భోజనాలు, ప్రవేశము, జ్ఞానము అన్ని ఉచితంగానే నిర్వహిస్తున్నాం. చాలామంది ఫీజులు పెడుతూ ఉంటారు కానీ పత్రిగారు "18 ఆదర్శ సూత్రాలలో" జ్ఞానం బోధించడానికి ఫీజు ఉండకూడదు అంటారు.

అంటే మనం ఫీజు తీసుకున్నట్లయితే అది సేవ క్రిందకి రాదు, చెప్పిన వాడికి అనుకున్న ఫలితం రాదు, విన్నవాడిమీద దాని ప్రభావం ఉండదు.

అందుచేత చెప్పినవాడు లాభం పొందాలన్నా, విన్నవాడు దాని ఫలితం పొంద గలగాలి అన్నా కచ్చితంగా పత్రీగారు చెప్పినట్టు ఇంత గొప్ప జ్ఞాన బోధలో డబ్బులు ఆశించకూడదు. అదే నేను మొదట్లో తెలుసుకున్నాను, ఇది చాలా, చాలా ముఖ్యమైన విషయం.

డబ్బులు ఆశించేటట్లయితే ఇందులోకి రావలసిన పనిలేదు. జ్ఞానబోధ కార్యక్రమాల్లో ఎవ్వరు డబ్బులు తీసుకోకూడదు. మొదట్లో మేము "ధ్యాన జగత్ పుస్తకానికి" ధనం కట్టించేవారం. ఆ తర్వాత అది కూడా మానేశాం, ఇప్పుడు పుస్తకాలు లేవు, ఫీజు లేదు.

మీరు ఈ దేహాన్ని సేవలకి, సాధనకి, స్వాధ్యాయానికి పుస్తక పఠనానికి, అలాగే వారి సందేశాలు వినడానికి ఉపయోగించండి. అందుకే మేడం, నేను పత్రి గారి వీడియోలు బాగా పెట్టుకుంటాము, విన్నవే మళ్ళీ వింటూ ఉంటాము. ఎన్నిసార్లు విన్నా మళ్ళీ మాకు కొత్త అర్థం అందులో నుంచి వస్తుంది, ఇంకా ఇంప్రూవ్ అవుతూ ఉంటాము. ఒక్కసారి విన్న దానికంటే ఇంకోసారి వింటే దాంట్లో నుంచి ఇంకా కొత్త అర్థాలు వచ్చి ఇంకా మేము ఇంప్రూవ్ అవ్వడమే కాదు, అందరికీ సందేశాలు బాగా ఇవ్వగలుగు తున్నాము.

అలా మా శరీరాన్ని ఉపయోగించుకుంటున్నాం. ఇది ఎంత ముఖ్యమో మాకు తెలుసు. మేము దేహం కాదు, ఆత్మలం అన్నది పత్రీగారి ద్వారా అర్థం చేసుకున్నాం. ఇంక అక్కడి నుంచి మా పనులు మారిపోయాయి. జీవితం "యూటర్న్ తిరిగిపోయింది." అంతకుముందు దేహ లాభాల కోసం పనిచేసేవారం, ఇప్పుడు ఆత్మలాభాల కోసమే కృషి చేస్తున్నాం.

మాణికేశ్వరి మాత ఇచ్చిన సందేశాన్ని పాటిస్తున్నాం.

**"మీ భౌతిక శరీరం మీకు ఇవ్వబడిన బహుమతిగా భావించండి. దానిని పనికి రాని పనులకు ఉపయోగించకండి. మీకు అంటే ఆత్మకు**

**లాభం కలిగించే పనులు చేయించండి."**

ఈ సందేశం అర్థం చేసుకోవాలంటే పత్రిగారు మనకు గత లాక్ డౌన్ పీరియడ్ లో "వంద ఎపిసోడ్లు" చెప్పారు. అందులో ఒక సందర్భంగా ఆయన ఒక విషయం చెప్పారు.

"మేను – నేను" అని. నేను వేరు, మేను వేరు. మేను అంటే ఈ శరీరం. " ఈ శరీరం నేను కాదు. నేను వేరే ఉన్నాను." అది ఆయన చెప్పింది. ఈ మేను నేను కాదు మరి నేను ఎవరు? అంటే ఆ నేనే "ఆత్మ." అదే ఆయన చెప్పింది. నేను అన్నది ఆత్మ. ఈ మేను అన్నది నాదే కానీ "నేను కాదు" అంటే ఈ శరీరం నాదే కానీ నేను కాదు. ఇది బాగా అర్థం చేసుకోవాలి.

మీరు చూడండి. ఎవరో మీ చెంప మీద గట్టిగా కొట్టారు. బాగా వాచిపోయింది. ఏమంటారంటే నా చెంప వాచింది అంటారు, నేను వాచాను అనరు. మరి ఇది మీరే అయితే నేను వాచాను అని ఎందుకు అనరు అంటే మీరు వేరే ఉన్నారని మీ అంతట మీరే మీకు తెలియకుండానే అంగీకరిస్తున్నారు. అలాగే నా కాలు విరిగింది అంటారు. నేను విరిగాను అనరు అంటే అక్కడ కూడా ఆ కాలు నేను కాదు అని చెప్పినట్టే!

అలాగే నా చెయ్యి కాలింది. నా చెయ్యి అంటారు అంటే అర్థం ఏంటి? "నేను వేరే ఉన్నాను" అనేగా అర్థం. మరి నేనెవరు? ఆ నేనే ఆత్మ అన్నది ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఆ విషయమే పత్రిగారి పరిచయం వల్ల నేను కూడా తెలుసుకోవడం జరిగింది. అప్పటిదాకా ఈ "మేనే" నేను అనుకున్నాను. పత్రిగారి పరిచయం అయ్యాక "ఈ మేను వేరు, నేను వేరు" అన్నది తెలుసుకున్నాను. నేను ఆత్మ, ఈ మేను నాది అని తెలుసుకున్నాను.

మనం అంటాం కదా? ఓ సెల్ ఫోన్ మీ దగ్గర ఉందనుకోండి. నా ఫోన్ అంటాం అంటే ఆ ఫోన్ మీరు కాదనేగా. నా శరీరం అంటే ఇది నా

శరీరమే కానీ నేను కాదనే కదా అర్థం.  మరి నేను ఎవరు అంటే నేనే ఆత్మను,  ఇది నా శరీరం. శరీరం కనిపిస్తుంది కాబట్టి దీన్ని "భౌతిక శరీరం" అంటారు.

మీరు పై లోకాల్లో నుంచి భూమి మీదకు ఎందుకు వచ్చారు? అంటే  ఆత్మ అయిన మీరు భూమిమీద కొన్ని సాధనలు చేయడానికి, కొన్ని అనుభవాలు పొందడానికి, కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి తద్వారా ఆత్మకు లాభం కలిగించే అంటే మీకు లాభం కలిగించే పనులు చేయడానికి భూమి మీదకు వచ్చి ఒక తల్లి గర్భంలో తయారయ్యే మేనులో మీరు ప్రవేశించారు.

తొమ్మిది నెలలు పూర్తి అయిన తర్వాత జన్మ తీసుకున్నారు. అలా వచ్చి కొన్నాళ్ళు ఈ శరీరంలో ఉంటూ, ఈ శరీరంతో చేయవలసిన పనులు చేస్తూ తర్వాత మీ పనులు అయిపోయినప్పుడు మళ్ళీ శరీరాన్ని వదిలేసి పైకి వెళ్ళిపోతూ ఉంటారు. అందుచేత ఇది తాత్కాలికంగా మీరు ధరించినటు వంటి మేను మాత్రమే కానీ,  నేను కాదు.  ఇది ప్రతి ఒక్కరూ పదే పదే తెలుసుకోవాలి, ఆలోచించాలి.  అంతేకానీ ఇది అర్థం చేసుకోకపోతే జీవితంలో ఎంతో నష్టపోతారు.

ఈ మేనునే నేను అనుకుంటున్నారు, నేనుని మర్చిపోయారు, ఆ నేను గురించి ఆలోచించటం లేదు.  ఈ **"మేను నేను కోసమే కానీ, మేను కోసం నేను కాదు"** అంటే **"ఆత్మ కోసం శరీరం కానీ, శరీరం కోసం ఆత్మ కాదు".** అంటే ఆత్మ లాభాల కోసమే శరీరాన్ని ఉపయోగించుకోవాలి కానీ శరీర లాభం కోసం ఆత్మను బలి చేయకూడదు  అన్నది తెలుసుకోవాలి.

మాణికేశ్వరి మాత అదే చెప్తున్నారు. మరి మేను  ఎందుకు ఇవ్వబడింది?  మీ కోసం అంటే నేను కోసం అంటే ఆత్మ కోసం ఈ శరీరం ఇవ్వబడింది.  శరీరం లేకపోతే ఆత్మకు లాభం కలిగించే పనులు చేయలేరు. శరీరం ఉంటేనే చేయగలరు,  ఈ శరీరం తోటే చేయగలరు. అందుచేత

ఆత్మకు లాభం కలిగించే పనులు మీరు ఈ శరీరంతో చేయాలి, చేసి ఆత్మకు లాభం కలిగించాలి, దానికోసమే మీరు శరీరం తీసుకున్నారు.

అందుచేత ఈ శరీరం మీకు ఇవ్వబడిన బహుమతి. ప్రకృతిచే, భగవంతునిచే ఇవ్వబడినటువంటి ఒక బహుమతి. శరీరం మీకు ఒక గిఫ్ట్‌గా ఇవ్వబడిందని తెలుసుకోవాలి.

మాణిక్యేశ్వరి మాత అదే చెప్తున్నారు. **"మీ భౌతిక శరీరాన్ని మీకు ఇవ్వబడిన బహుమతిగా భావించండి."**

అంటే ఇది మీకు ఇవ్వబడినటువంటి గిఫ్ట్. శరీరం ఉండబట్టే కదా మీరు ఈ ధ్యానం చేస్తున్నారు, ఈ శరీరం ఉండబట్టేగా మీరు జ్ఞానవంతమైన పుస్తకాలు చదువుతున్నారు, శరీరం ఉండబట్టే కదా ఇలా సాంగత్యాలు చేసి అద్భుతమైన జ్ఞానాన్ని వింటున్నారు, ఈ శరీరం ఉండబట్టే కదా ఎన్నో సేవలు చేసి ఆ పుణ్యం అంతా సంపాదించుకుంటున్నారు.

ఇవన్నీ ఎందువల్ల సంపాదించుకోగలుగుతున్నారు అంటే శరీరం ఉండబట్టే. ఇది లేకపోతే ఏం చేయగలరు? అందుచేత ఈ శరీరం అన్నది మీకు ఇవ్వబడిన బహుమతిగా భావించాలి అని మాణికేశ్వరి మాత చెప్పడం జరిగింది. ఎంత అద్భుతమైన సందేశమండి. దాంట్లో ఇంత లోతుగా ఆలోచిస్తే తప్ప, ఆవిడ మాటలు అర్థం కావు. శరీరాన్ని సుఖపెట్టడం కాదు, శరీరాన్ని ఉపయోగించుకోవాలి. దేనికోసము అంటే ఆత్మకోసం అంటే మీకోసం.

మీరు అంటే ఆత్మ అంటే నేను. అందుచేత ఈ శరీరాన్ని పనికిరాని పనులకు ఉపయోగించకండి అని ఆవిడ అన్నారు. "పనికి రాని పనులు అంటే ఈ శరీరంతో హింస చేస్తే మీరు ఎంతో నష్టపోతారు, ఆత్మైన మీరు చాలా నష్టపోతారు. ఆ కోళ్ళను చంపి, ఆ మేకలను చంపి వాటిని తింటున్నారు అనుకోండి. ఈ చేతులతో చంపి, ఈ చేతులతోటే వండి, ఈ నోటితోటే

తింటే ఆ హింసకు మీరు ఎంతో నష్టపోతారు. ఆత్మ అయినటువంటి మీరు ఎంతో నష్టపోతారు.

శరీరం వదిలి పైకి వెళ్తే ఏమి లాభం లేదు, ఎంత నష్టపోయారో పైకి వెళ్ళాకే తెలుస్తుంది. అందుచేత ఈ శరీరంతో పనికి రాని పనులు చేయకండి, తప్పులు చేయకండి, పాపాలు చేయకండి, అధర్మంగా సంపాదించకండి, సృష్టి విరుద్ధమైన పనులు చేయకండి, అవినీతికి పాల్పడకండి, అక్రమాలు చేయకండి, దౌర్జన్యాలు చేయకండి, స్వార్ధ పూరిత పనులు చేయకండి.

ఇటువంటి పనులన్నీ చేస్తే ఆత్మకు ఎంతో నష్టం, అందుకే "ఆత్మ క్షోభిస్తూ" ఉంటుంది. ఎవరైతే ఆత్మకు నష్టం కలిగించే పనులు చేస్తారో వాళ్ళు ఆత్మక్షోభతో అలమటిస్తూ ఉంటారు.

పత్రి గారు చెప్తారు, ఎవరైతే ఆత్మకు లాభం కలిగించే పనులు చేస్తూ ఉంటారో వారి ఆత్మ ఆనందంతో ఉప్పొంగుతూ ఉంటుంది, అది ఎవరికి వాళ్ళు గమనిస్తారు. మీరు ఓ మంచి సేవలో పాల్గొనండి, లోపల మీకు తెలియని ఆనందం మీరు అనుభవిస్తూ ఉంటారు. ఆ కోడినో, మేకనో చంపుతూ ఉంటే లోపల ఆ క్షోభ, రంపపు కోతలా కోసేస్తూ ఉంటుంది. అది భరించలేరు. అందుచేత ఆవిడ ఏం చెప్పారు అంటే ఈ దేహాన్ని పనికి రాని పనులకు ఉపయోగించకండి. మీకు అంటే ఆత్మకు లాభం కలిగించే పనులు చేయించండి అన్నారు.

మాకు ఎలా తెలుస్తుందండి అంటారు? అందుకే మరి ఈ మార్గంలోకి రావాలి, పత్రిగారిని అనుసరించాలి, పత్రిగారి పుస్తకాలు చదవాలి, పత్రిగారి వీడియోలు చూడాలి ఇవన్నీ మీరు చేసినట్లయితే అంతా తెలుసుకుంటారు, బాగా అర్థం చేసుకుంటారు. అప్పుడు ఆత్మకు లాభం కలిగించే పనులు చేస్తారు, లేకపోతే ఆత్మకు నష్టం కలిగించే పనులు చేసి ఎంతో

నష్టపోతారు.

ఈ శరీరంతో ఆత్మకు లాభం కలిగించే పనులు చేస్తే ఏమవుతుందో తెలుసుకుందాం. ఎవ్వరైనా ఈ శరీరంతో కొన్నాళ్ళే ఉంటారు. వాళ్ళు నిర్ణయించుకుని వచ్చిన ప్రకారం 60, 70, 80 ఏళ్ళు ఉండొచ్చు. ఎవరు ఎన్ని సంవత్సరాలు పైన నిర్ణయించుకొని వస్తారో అంతకన్నా ఎక్కువ ఉండలేరు. వాళ్ళు నిర్ణయించుకున్నటువంటి సమయం అయిపోతే ఏదో కారణం రీత్యా అంటే జబ్బు అనో, లేకపోతే ఇంకోకటి అనో, యాక్సిడెంట్ లోనో లేకపోతే ఆటోమేటిక్ గా సహజ మరణం అనో మొత్తం మీద ఆత్మ అయినటువంటి వాళ్ళు ఈ శరీరాన్ని వదిలేస్తారు.

పై లోకాలకి వెళ్తారు, పైన కూడా కోటాను కోట్ల లోకాలు ఉంటాయి. ఎన్నో ఉన్నత లోకాలు ఉన్నాయి, అధోలోకాలు ఉన్నాయి. పత్రిగారు అవే చెప్తారు, భూలోకం పైన భువర్లోకం ఉంది, భువర్లోకం పైన సువర్లోకం ఉంది, సువర్లోకం పైన జనాలోకం ఉంది, జనాలోకం పైన మహాలోకం ఉంది, మహాలోకం పైన ఇంకా గొప్పదైనటువంటి తపోలోకము అంటే బ్రహ్మాలోకం, ఇంకా ఇంకా దానికంటే పైకి వెళ్తే సత్యలోకం అంటే ఎవరినైతే మనం దేవుళ్ళు అంటున్నామో వాళ్ళందరూ ఉండేటువంటి ఆ లోకం ఉంది.

అంత గొప్ప గొప్ప లోకాలు ఉన్నాయి. ఎవరు ఎంత ఉన్నతమైన లోకాలకు వెళ్తారో వాళ్ళంత గొప్పవాళ్ళు అవుతారు. ఎవరైతే క్రింద లోకాల్లోనే ఉంటారో వాళ్ళంతా అల్పులు, అధములు అని లెక్కవేసుకోవచ్చు. అందుచేత ఆత్మకు లాభం కలిగించే పని ఏది అంటే మనల్ని అంటే ఆత్మను ఉన్నత లోకాలు చేర్చగలిగేదే. గుర్తుంచుకోండి ఆత్మ ఉన్నత లోకాలు పొందాలి అంటే ఎవరైనా సరే ఈ ఆత్మ కోసం, ఆత్మ లాభం కోసం దేహాన్ని ఉపయోగించుకోవాలి.

ఈ దేహంతో పత్రిగారు చెప్పినట్టు ధ్యాన సాధన చేయించాలి,

అంతేకాదు ఈ దేహంతో జ్ఞానవంతమైన పుస్తకాలు చదివించాలి, జ్ఞానుల సాంగత్యం చేయాలి, సేవలు చేయాలి. ఈ శరీరంతో ఈ పనులన్నీ చేయించడం దేనికి అంటే ఆత్మైన మీరు ఉన్నత లోకాలు పొందడం కోసం. అంతేగానీ దీన్ని ఏసీలో పడుకోబెట్టి, మూడు పూటలా ఫైవ్ స్టార్ భోజనాలు ఇస్తూ సుఖపెట్టడానికి కాదు.

మీరు రమణ మహర్షి గారిని చూస్తే ఈ దేహాన్ని ఎంత బాగా ఉపయోగించుకున్నారు అన్నది తెలుస్తుంది. ఆయన ఈ దేహాన్ని బాగా ఉపయోగించుకొని విపరీతమైన ధ్యాన సాధన చేయించాడు. మరి ఆయన ఎంత గొప్పవాడు అయ్యాడు చెప్పండి. కానీ మీరు దీన్ని ఏసీలో పడుకోబెడుతున్నారు, బాగా మేకప్ చేస్తున్నారు, మేకప్‌కి ఎన్ని గంటలు తీసుకుంటారో చూడండి. ఎంత డబ్బు ఖర్చు పెడతారో చూడండి, దీనితో విందులు, వినోదాలు, విలాసాలు చేస్తున్నారు, తినకూడనివి తింటున్నారు, హింసలో పాల్గొంటున్నారు, ఈ దేహంతో ఎన్నో పనికి రాని పనులన్నీ చేస్తున్నారు. కానీ రమణ మహర్షి గారు దీన్ని ఎంత బాగా ఉపయోగించు కున్నారు, ఎంత గొప్పవాడు అయ్యాడు. రమణ మహర్షిలా ఈ దేహాన్ని ఉపయోగించుకుంటే పత్రిగారు చెప్పినట్టు గొప్పవాడుగా అవుతారు.

ఒక చిన్న ఉదాహరణ. చూడండి గుర్రపురౌతు ఒక గుర్రాన్ని కొనుక్కున్నాడు, వాడు ఆ గుర్రాన్ని జాగ్రత్తగా పోషించి దాన్ని ఉపయోగించు కుంటే అంటే దానిపై స్వారీ చేస్తే గమ్యాన్ని చేరుకుంటాడు. వాడు జాగ్రత్తగా తిండి పెట్టి, నీరు పెట్టి దాన్ని ఉపయోగించుకుంటే ఎక్కడికైనా వాడి గమ్యానికి అది తీసుకెళ్తుంది, అంత బాగా ఉపయోగపడుతుంది.

అలాగే మీరు కూడా ఈ శరీరాన్ని జాగ్రత్తగా పోషించాలి. దానికి అవసరమైన తిండి, నీరు అన్ని ఇవ్వాలి, దానికి విశ్రాంతిని ఇవ్వాలి. అలా పోషిస్తూ దీనిచేత సాధన చేయిస్తే మీ గమ్యమైనటువంటి ఆ “సత్యలోకానికి”

చేరుకుంటారు, ఆ మోక్షాన్ని పొందుతారు. అంతేగాని ఆ గుర్రాన్ని రోజు పోషిస్తున్నాడు, బాగా నీళ్ళు పెడుతున్నాడు, దాణా వేస్తున్నాడు, అన్నీ చేస్తున్నాడు, గుర్రం బాగా పుష్టిగా తయారయ్యింది కానీ దాన్ని ఉపయోగించడు. మరి వాడిని ఏమంటారు అంటే మూర్ఖుడు అంటారు.

అలాగే మీరు దేహాన్ని బాగా పోషిస్తున్నారు, మూడు పూటలా పెడుతున్నారు, ఏసీలో పడుకోపెడుతున్నారు, దానికి ఏం కావాలో అన్ని చూస్తున్నారు, అన్ని సుఖాలు సమకూరుస్తున్నారు, కానీ ధ్యాన సాధనకు ఉప యోగించుకోకపోతే, ఊరికే సుఖపెడితే వాడిని కూడా “మూర్ఖుడు” అని అంటారు. అందుచేత గుర్తుపెట్టుకోండి, ఈ దేహం అన్నది మీకు ఇవ్వబడిన ఒక “పనిముట్టు” లాంటిది, దీన్ని ఆత్మ కోసం బాగా ఉపయోగించుకోవాలి.

మీకు ఇంకో ఉదాహరణ: ఒక కొత్త కారు 15 లక్షలో, 20 లక్షలో పెట్టికొన్నారు. తళ, తళా మెరిసిపోతుంది, కార్‌ని షెడ్ లో పెట్టారు, బయటికి తీస్తే గీతలు పడిపోతుందో, లేకపోతే బురద అయిపోతుందో, ఆ కొత్తదనం పోతుందని తీయడం మానేసి రోజు ఆ షెడ్ లోనే దాన్ని బాగా తుడుస్తున్నారు. అలా రోజు బాగా తుడుస్తూ దాన్ని అలాగే ఉంచేశారు. కొన్ని సంవత్సరాలు అయ్యేసరికి ఏమవుతుంది అంటే అది “తుప్పుపట్టి” ఎందుకు పనికి రాకుండా పోతుంది.

అందుచేత ఎవరైతే అటువంటి కారు బాగా ఉపయోగించుకుంటే ఎంత పనైనా చేస్తుంది, ఎన్ని ఊళ్ళైనా తిరుగుతుంది, వీడికి ఎంతైనా ఉపయోగపడుతుంది. అలా ఉపయోగించుకున్నవాడు తెలివైనవాడు. వూరికే అలా ఉంచితే తుప్పు పట్టి పోతుంది, తర్వాత తీసి ఉపయోగిద్దాం అంటే ఎందుకు పనికి రాదు. అలాగే ఈ దేహాన్ని బాగా పోషిస్తూ ఇలాగే ఉంచితే కొన్నాళ్ళకి ముసలిది అయిపోతుంది, ఇలాగే ఉండదు, నువ్వు చేసిన మేకప్ లాగ అలాగే ఉండదు, ముసలిది అయిపోతుంది, ముసలిది అయ్యాక దీని

చేత సాధన చేయించాలంటే ఏమి ఉపయోగం లేదు.

అందుచేత కారు షెడ్డులో పెట్టి రోజు తుడిస్తే వాడు ఎంత మూర్ఖుడో, ఈ శరీరాన్ని రోజు పోషిస్తూ ఏసీలో పడుకోబెడితే వాడు అంతే మూర్ఖుడు.

ఆ కారు మీద దయ తలచకుండా దాన్ని ఉపయోగించుకుంటే ఎంతో లాభం పొందుతాడు. అలాగే ఈ శరీరం మీద దయ తలచకుండా దీన్ని ఉపయోగించి సాధన చేయిస్తే ఒక రమణ మహర్షి లాగా, ఓ రామకృష్ణ పరమహంస, వివేకానంద లాగా చేయిస్తే వాడు ఎంతో గొప్పవాడు అవుతాడు. ఇది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి, ఇది తెలుసుకోకపోతే నష్టపోతారు.

ఈ దేహం మీకు ఇవ్వబడిన ఒక పనిముట్టు, ఒక బహుమతి. మాణికేశ్వరి మాత చెప్పినట్టు ఇది మనం తెలుసుకోవాలి. ఇంకా ఈ శరీరం ఒక అద్దె ఇల్లు లాంటిది. మీరు చూడండి. అద్దె ఇంట్లో ఉండేవాళ్ళు ఎవరైనా సరే ఆ ఇంట్లో ఉన్నంత సేపు ఇది అద్దె ఇల్లు అనే భావంలో ఉంటారు, కాని సొంత ఇల్లు అనుకోరు. అందుచేత ఆ ఇంటికి పాలరాళ్ళ గాని, గ్రానైట్లు గాని లేకపోతే నగిషీలు గాని, డెకరేషన్ లు గాని ఏమి చేయించరు, కారణం ఆ ఇల్లు తనది కాదు కాబట్టి.

ఎప్పుడో వాడు ఖాళీ చేయమన్నప్పుడు దాన్ని ఖాళీ చేయాలి. కానీ ఆ ఇంటికే వాడి సంపాదన అంతా పెట్టాడు. జీవితంలో సంపాదించింది అంతా దాని డెకరేషన్‌కే పెట్టేసాడు. ఇప్పుడు ఖాళీ చేయమంటే ఏమవుతుంది? అన్ని వదిలేయాలి. ఎంత నష్టపోతాడు చెప్పండి, ఎంత బాధపడతాడు చెప్పండి. మరి దానికి ఎందుకు పెట్టాడు? సొంత ఇల్లు అనుకున్నాడు. వాడు అద్దె ఇల్లును సొంత ఇల్లు అనుకున్నాడు. నిజంగా అద్దె ఇల్లు అని భావించేవాడు ఏమి పెట్టడు. ఏదైనా బల్బు పోతే బల్బు వేస్తాడు, ఓ ట్యాప్ పోతే ట్యాప్ వేస్తాడు. అంతే తప్ప దానికోసం ఏమి చేయడు.

ఒకవేళ ఆ యజమానే వాడిని ఖాళీ చేయమంటే వాడు సంతోషంగా

ఖాళీ చేస్తాడు. ఎందుకు? దానికి ఏమి చేయలేదు. తను సంపాదించుకున్నది కూడా పట్టుకెళ్ళగలిగేవే సంపాదించుకున్నాడు, ఏసి కొంటే ఊడతీసి పట్టుకెళ్తాడు, ఫ్రిడ్జ్ కొంటే ఊడతీసి పట్టుకెళ్తాడు, మంచం కొనుక్కుంటే ఊడతీసి పట్టుకెళ్తాడు, డబ్బు సంపాదిస్తే పట్టుకుపోతాడు, బంగారం కొనుక్కుంటే అది కూడా పట్టుకుపోతాడు. అప్పుడు వీడేమి నష్టపోడు కానీ ఎవరైతే కూడా పట్టుకెళ్ళగలిగేవి మానేసి దానికే పెడతారో వాళ్ళు ఎంతో నష్టపోతారు.

అలాగే ఈ దేహం కూడా ఒక అద్దె ఇల్లు లాంటిది. మీరు పైలోకంలో 30 ఏళ్ళో, 50 ఏళ్ళో, 70 ఏళ్ళకో రెంట్ కి "అగ్రిమెంట్" రాసి తెచ్చుకున్నారు. ఆ టైమ్ అయిపోతే ఈ శరీరాన్ని ఖాళీ చేయాలి. ఇది ఒక రెంటెడ్ హౌస్, దీన్ని ఖాళీ చేయాలి. మరి ఇది సొంతం కాదు అని తెలుసుకున్నవాడు ఏం చేస్తాడు? కూడా పట్టుకెళ్ళగలిగేవి సంపాదిస్తాడు. ఇది సొంత ఇల్లు అనుకున్నవాడు అంతా దీనికే పెడతాడు. సహజంగా ఇప్పుడు లోకంలో అంతా ఈ దేహం సొంత ఇల్లు అనుకుంటున్నారు.

ఇదే నేను అనుకుంటున్నారు, దీనికే పెడుతున్నారు. దీన్ని సుఖపెట్టడానికి లక్షలు సంపాదిస్తున్నారు, కోట్లు సంపాదిస్తున్నారు. ఇంకా దీన్ని బాగా సుఖపెట్టాలని ఎన్నెన్నో పోగేస్తున్నారు. ఎంతో డబ్బు లక్షలు, కోట్లు సంపాదించి దీనికే పెడుతున్నారు. కూడా పట్టుకెల్లగలిగేవి ఎవడు సంపాదించట్లేదు. మరి నిజంగా ఈ దేహం ఎప్పుడో అప్పుడు వదిలేయాలి, అగ్రిమెంట్ అంటే పైన తెచ్చుకున్న టైం అయిపోతే వదిలేయాలి. వదిలేసినప్పుడు అన్ని ఇక్కడే ఉండిపోతాయి. ఏది కూడా రాదు ఎంత నష్టపోతాడు ఆలోచించండి.

ఇది అద్దె ఇల్లు అని అర్థం చేసుకున్నవాడు దీనికి పెట్టడు. ఓ రమణ మహర్షి లాగ, ఓ వివేకానందలాగ ఏం చేస్తాడు? దీన్ని ఉపయోగించి సాధన చేసి కూడా పట్టుకెళ్ళగలిగే జ్ఞానం సంపాదించుకుంటాడు. ఇది సొంత

ఇల్లు అనుకున్నవాడు ధనం సంపాదిస్తాడు. ఇది అద్దె ఇల్లు అని తెలుసుకున్న యోగి ధ్యానం చేసి "జ్ఞానం" సంపాదిస్తాడు. ఎప్పుడైతే జ్ఞానం సంపాదిస్తాడో ఈ శరీరం వదిలేసిన తర్వాత, ఖాళీ చేసిన తర్వాత పైకి వెళ్ళినప్పుడు గొప్ప ఉన్నత లోకాలు చేరుకుంటాడు, వాడు అదృష్టవంతుడు.

అందుచేత ఈ శరీరంలో ఉన్నంత కాలము ఒక అద్దె ఇల్లు అని భావించాలి. భావించి దీనికే అన్నీ పెట్టకూడదు, కూడా పట్టుకెళ్ళ గలిగేవి సంపాదించుకోవాలి, అదే జ్ఞానం. ఇది పత్రిగారి పరిచయం వల్ల నాకు తెలిసింది, ఆయన ద్వారా అర్థం చేసుకున్నా. అంతకుముందు వ్యాపారం చేస్తూ కోట్లు సంపాదించి ఎన్నో బిల్డింగ్‌లు కడుతూ అబ్బో! అదృష్టవంతుడిని అనుకున్నాను. పత్రిగారి పరిచయం అయ్యాక తర్వాత తెలిసింది. నువ్వు దేహం కాదు అన్నారు, ఆశ్చర్యపోయాను!

నేను దేహం కాకపోవడం ఏమిటి? ముందు నమ్మలేదు తర్వాత అన్ని తెలుసుకుంటే అర్థమైంది. తర్వాత నువ్వు ఆత్మవి అని చెప్పారు. నేను ఆలోచించాను, ఇంచుమించు 50 ఏళ్ళు నేను కష్టపడ్డాను, ఎంతో సంపాదించాను. అవి నాకేమైనా అంటే ఆత్మైన నాకు ఏమైనా ఉపయోగ పడతాయా అంటే ఏమి ఉపయోగపడవు అన్నది తెలిసింది. మరి నేను లాభం పొందాలి అంటే ఏం చేయాలి? అని ఇరవై మూడు ఏళ్ళ క్రితం ఆలోచించాను. అప్పుడు తెలిసింది ఈ వ్యాపారాలు కాదు, ధనం కాదు జ్ఞానం కావాలి అని తెలిసింది.

ఆ జ్ఞానం కావాలంటే ఏం చేయాలి? ఆ జ్ఞానం పొందే మార్గం ఎవరు మనకి బాగా చెప్తున్నారు అని ఆలోచిస్తే "ఇప్పుడు భూమి మీద ఉన్న మాస్టర్ల అందరికంటే గొప్పవారు ఎవరు అంటే సుభాష్ పత్రి గారు" అని తెలుసుకున్నాను. ఆయన ఏం చేస్తున్నారు? అంటే ఊరూరు తిరిగి ధ్యాన ప్రచారం చేస్తున్నారు, జ్ఞానాన్ని చెప్తున్నారు, ఎన్నో సేవలు చేస్తున్నారు. ఓహో!

అలా మనం కూడా ఇవన్నీ చేయాలా? అని అర్థం చేసుకొని అప్పటినుంచి అంటే 23 ఏళ్ళ క్రితం మొదలపెట్టాను. ఇప్పటిదాకా నాన్ స్టాప్ గా పత్రిగారు తిరుగుతున్నట్టే నేను తిరుగుతూనే ఉన్నాను.

ఆయన దగ్గర నుంచి ఇంకా తెలుసుకున్నాను. జ్ఞానం బాగా పెరగాలి అంటే తీవ్ర సాధన చేయాలి. సరైన సాధన "శ్వాస మీద ధ్యాస" ధ్యాన సాధన చెయ్యాలి.

పుస్తకాలు చదవాలి. జ్ఞానం సంపాదించుకునే పనులు చేయాలి, ఆ జ్ఞానాన్ని అందరికీ బోధించాలి, ఇదే నా పని అని తెలుసుకున్నాను.

నేను పుస్తకాలు వ్రాశాను, సందేశాలు ఇస్తున్నాను, ఎన్నో చోట్లకు తిరుగుతున్నాను, మూడు రోజుల క్లాసులు నిర్వహిస్తున్నాను.

అంతకుముందు ఎంత ధనం సంపాదించినా శాంతి లేదు. ఇప్పుడు ఆ ధన సంపాదన లేకపోయినా ఎంతో శాంతిగా నేను జీవించగలుగుతున్నాను. అంతకుముందు నేను నా కుటుంబానికే మేలు చేసుకున్నాను. ఇప్పుడు ఎన్నో వేల మందికి, లక్షల మందికి నేను మేలు చేయగలుగుతున్నాను. అంతకు ముందు అజ్ఞానంలో జీవించాను. ఇప్పుడు నేను జ్ఞానం సంపాదించుకున్నాను. అంతకు ముందు దేహ సేవలు చేసేవాడిని. ఇప్పుడు నేను ఆత్మ సేవలు, ఆధ్యాత్మిక సేవలు చేస్తున్నాను, ఇలా నా లైఫ్ లో ఎంతో మార్పు వచ్చింది. ఇంకా నేను దేహం కాదు నేను ఆత్మను అని అర్థం చేసుకున్నాను.

మీరు నేను ఆత్మ అని గుర్తు చేసుకుంటున్నా నలుగురిలోకి వెళ్ళేసరికి దేహం అన్నట్టుగా ప్రవర్తిస్తూ ఉంటారు, దేహ లాభాల కోసం చూస్తారు, దేహ పనులకే ప్రాముఖ్యం ఇస్తారు. ఆత్మ గురించి ఆలోచించరు. ఆత్మ లాభాలకేమి చేయరు.

కానీ మాణికేశ్వరి మాత చెప్తున్నారు ఈ దేహాన్ని నీకు ఇవ్వ బడినటువంటి ఒక బహుమతిగా భావించి దీన్ని నీ లాభానికి అంటే ఆత్మ లాభాలకు ఉపయోగించుకోవాలి.

అందుచేత ఈ దేహాన్ని ఆత్మ కోసం మరి ముఖ్యంగా "శ్వాస మీద ధ్యాస" ధ్యాన సాధనకు, అలాగే ఆత్మజ్ఞానాన్ని ఇచ్చేటువంటి పుస్తకాలు చదవడానికి ముఖ్యంగా పత్రిగారి పుస్తకాలు, అలాగే ఇప్పుడు నేను వ్రాసినటువంటి పుస్తకాలు చదవండి, మీకు అర్థమవుతుంది. అలాగే సాంగత్యం అంటే ఇప్పుడు మనం మార్నింగ్ జూమ్ పెడుతున్నాం, మూడు రోజుల క్లాస్ భీమవరంలో పెడుతున్నాం, కడ్తాల్‌లో పెడుతున్నాం, బెంగళూరులో పెడుతున్నాం. ఇలా ఇంకా ఎన్నో చోట్ల పెడుతున్నాం, వాటికి వెళ్లి సాంగత్యం చేయాలి.

అలాగే సేవలు పత్రిగారు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవలు చేసే భాగ్యం అందరికీ కలిగిస్తున్నారు. మీకు ఉండే ధనాన్ని, మీ సమయాన్ని, మీ వాక్కుని, మీ జీవితాన్ని అన్నిటిని ఈ సేవలకు ఉపయోగించండి. యజ్ఞాల్లో పాల్గొనండి. ఇవ్వగలిగిన ధనం ఇవ్వండి లేకపోతే మీ శరీరాన్ని ఉపయోగించి అక్కడ సేవలలో పాల్గొనండి. ఏది చేయగలిగితే అది చేయండి. ఇవన్నీ మీ ఆత్మకు అంటే మీకు ఎంతో ఉపకరిస్తాయి, ఎంతో లాభం చేకూరుస్తాయి.

అప్పుడు మీరు శరీరం వదిలిన తర్వాత ఎన్నో గొప్ప ఉన్నత లోకాలకు చేరుకోగలుగుతారు. అంతేకాదు ఆ ఉన్నత లోకాలకు చేరుకొని మీరు అక్కడే ఉండిపోరు. ఇంకా ఎదగడానికి, ఇంకా ఉన్నత స్థితి సంపాదించడానికి మరలా భూమి మీదకు వస్తారు. ఇంకొక జన్మ తీసుకుంటారు. అలా భూమి మీదకు వచ్చినప్పుడు, ఇంకో జన్మ తీసుకున్నప్పుడు చాలా ఉన్నతమైన జన్మ మీకు లభిస్తుంది. గొప్ప జన్మ మీకు లభిస్తుంది.

ఈ విషయమే భగవద్గీతలో శ్రీ కృష్ణుల వారు కూడా చెప్పడం జరిగింది. ఎవరైతే అలా ధ్యానం చేస్తూ మధ్యలోనే శరీరం వదులుతారో! అలాంటి వారు పుణ్యలోకాలకి చేరుకొని అక్కడ ఆ పుణ్యం అనుభవించి మరల జన్మించినప్పుడు శ్రీమంతుల గృహంలో కానీ, యోగుల గృహంలో కానీ జన్మించి తదనంతర సాధన పూర్తి చేసుకుని 'మోక్షాన్ని' పొందుతారు అని చెప్పారు.

# “భగవంతునికి (ఆత్మకి) సంపూర్ణ శరణాగతి చెందండి”

భగవంతుడు అంటే చాలామందిలో గుళ్ళో ఉన్న విగ్రహం అనేటువంటి భావం ఉంటుంది. కాని అది “కృష్ణుడు యొక్క బొమ్మ” కానీ కృష్ణుడు కాదు. మరి ఎవరు కృష్ణుడు అంటే ఆయనే చెప్పారు.

**శ్లో॥ అహమాత్మ గుడాకేశా సర్వభూతాశయ స్థిత**
**అహమాదిశ్చ మధ్యంచ భూతానామన్త ఏవచ ॥ (భ.గీ.10-20)**

తా: ఓ అర్జునా! సర్వ ప్రాణులలో స్థితమై వున్న ఆత్మను నేనే అయి వున్నాను. మరియు ప్రాణులయొక్క అది మధ్యాంతములు నేనే అయి వున్నాను.

అంటే ఆయన నేను బొమ్మను కాదు, ఫోటోను కాదు... “నేను ఆత్మను” అని స్పష్టంగా చెప్పడం జరిగింది.

ఎవరైనా “భగవద్గీత తిరిగేసి ఆయన ఎక్కడైనా నేను ఫోటోని అని కానీ, నేను విగ్రహాన్ని అని కానీ చెప్పాడేమో ఒక్కసారి చూడండి.” శ్రీ కృష్ణుడు చెప్పిందాన్ని బట్టి “ఆత్మే” భగవంతుడు అన్న సంగతి మీకు అర్థమవుతుంది.

అందుచేత “మాణికేశ్వరి మాత” ఏమన్నారంటే భగవంతుడికి సంపూర్ణ శరణాగతి చెందండి అన్నారు. భగవంతుడు అంటే ఆత్మ కాబట్టి మనం ఆత్మకి సంపూర్ణ శరణాగతి చెందాలని అర్థం చేసుకోవాలి. “ఆత్మకు శరణాగతి” అంటే ఆత్మని ఎప్పుడు గుర్తుంచుకుంటూ ఉండాలి, ఆత్మని ఎప్పుడు తలుచుకుంటూ ఉండాలి, ఆత్మ మీద ఎప్పుడూ దృష్టి ఉంచాలి, ఆత్మకు దగ్గర అవడానికి ప్రయత్నం చేయాలి.

“అంతరాత్మ రూపంలో” అంతరంలో ఉన్న ఆత్మ చెప్పేటువంటి సందేశాలు ఆచరించే ప్రయత్నం చేయాలి. ఆత్మ హెచ్చరికలను వింటూ దానికి అనుగుణంగా మీ పనులు కానీ, మాటలు కానీ సరిచేసుకుంటూ ఉండాలి.

అలా ఆత్మకు శరణాగతి చెందినప్పుడు ఇవన్నీ పాటిస్తూ ఉంటారు. ఇవన్నీ ఎవరికి సాధ్యమవుతుంది అంటే ఎవరైతే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తారో వాళ్ళు ఆత్మకి శరణాగతి పొందినట్టే, ఆత్మను ఆశ్రయించినట్టే.

ఆత్మను ఆశ్రయించడం ఎలాగో చూద్దాం.. మనమంతా మానవులం. మానవుడు అంటే మూడు. శరీరము, మనస్సు, ఆత్మ... "ఆత్మ" అంటే భగవంతుడు. మీరు ఆత్మను ఆశ్రయించాలి అంటే ముందు కళ్ళు మూయాలి. అప్పుడు ఆలోచనలు వస్తాయి, అప్పుడు "శ్వాస మీద ధ్యాస" ఉంచుతే మెల్లిమెల్లిగా ఆలోచనలన్నీ ఆగిపోతాయి. ఎప్పుడైతే ఆలోచనలన్నీ ఆగిపోతాయో అప్పుడు మీరు ఆత్మను ఆశ్రయించిన వాళ్ళు అవుతారు.

ఆ స్థితినే 'ధ్యాన స్థితి' అంటారు. ఆ స్థితిలో గంటలు, గంటలు ఉంటే ఆత్మకు ఇంకా దగ్గర అవుతారు. ఆత్మకు ఎంత దగ్గర అయితే ఆత్మ లక్షణాలన్నీ మీకు వస్తూ ఉంటాయి. అంటే అక్కడ మీరు "ఆత్మకు శరణాగతి చెందినట్టు."

ముఖ్యంగా భగవంతుడి లక్షణం "ఆనందం." అంతేకాదు ఆయన అనంత శక్తి స్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు, సకల సద్గుణాలు కలిగిన వాడు. అటువంటి ఆయనను ఆశ్రయించినప్పుడు మెల్లిమెల్లిగా ఆయన యొక్క లక్షణాలు మీకు వస్తూ ఉంటాయి.

మీరు ఆనందంలో ఉండడం వల్ల గంటలు గంటలు కూర్చున్నా నిమిషాల్లా గడిచిపోతాయి. అలా భగవంతుడితో ఉంటే ఎంతసేపైనా కూర్చుంటారు. అందుచేత ఆ భగవంతుడుకి శరణాగతి అంటే కాస్త ఖాళీ దొరికితే ధ్యానంలో ఉండడం.

మాణిక్యేశ్వరి మాత చెప్పినట్టు ఆత్మకి శరణాగతి చెందితే ధ్యానానికి ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తారు, ధ్యానానికి ఆసక్తి చూపిస్తారు. అంతేకాదు ఆత్మకి శరణాగతి చెందడం అంటే ఆత్మ చెప్పినటువంటి ఆదేశాలు, సందేశాలు

పాటించాలి, హెచ్చరికలను పట్టించుకోవాలి.

అది ఎలాగో కొంచెం చూద్దాం... ఎవరైనా సరే ఏదైనా ఒక తప్పు చేస్తే నువ్వు తప్పు చేస్తున్నావు అని లోపల నుంచి హెచ్చరిక వస్తుంది. మీరు ఏ తప్పు చేయకపోతే, సృష్టి విరుద్ధంగా ప్రవర్తించకపోతే, అధర్మంగా వ్యవహరించకపోతే ఏ హెచ్చరిక రాదు. కానీ మీరు గనుక సృష్టి విరుద్ధమైన పని చేస్తున్నప్పుడు కచ్చితంగా లోపలి నుంచి హెచ్చరిక వస్తుంది. ఆ హెచ్చరిక ఎవరిదో కాదు లోపల ఉన్నటువంటి 'ఆత్మది' అంటే 'భగవంతుడిది.' ఎందుకు ఆ హెచ్చరిక అంటే అటువంటి అధర్మమైన, సృష్టి విరుద్ధమైన పని చేస్తున్నప్పుడు దాని ఫలితం చాలా ఘోరంగా మీరు అనుభవించాల్సి వస్తుంది.

అందుచేత ఆ భగవంతుడు అటువంటి కష్టాలు మీరు పడకుండా, ఆ రకమైన నష్టం మీకు కలగకుండా ముందే మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. మీరు ఆ హెచ్చరికల్ని పాటించాలి, అంటే ఆ తప్పుని చేయకుండా ఉండాలి. ఆత్మకి శరణాగతి చెందిన వాడు కచ్చితంగా పాటిస్తాడు, ఆ తప్పు చేయకుండా ఉంటాడు. అలా ప్రతి సందర్భంలో, ప్రతి పని విషయంలో, ప్రతి పనే కాదు మీ నోటి వెంట వచ్చే ప్రతి మాట ఏ మాత్రం తేడా ఉన్నా అంతరంలో ఉన్న ఆత్మ హెచ్చరిస్తూ ఉంటుంది.

వాటిని నిర్లక్ష్యం చేయకుండా పాటించినప్పుడు మీరు ఆత్మకు శరణాగతి చెందినట్టు. దాన్ని లెక్క చేయకపోతే, నిర్లక్ష్యం చేస్తే "ఆత్మను నిర్లక్ష్యం చేసినట్టే." ఇక అది శరణాగతి అవ్వదు.

కొన్ని ఉదాహరణలు తెలుసుకుందాం. మీరు ఏదైనా ఒక మాట అబద్ధం ఆడితే ఒక పది వేలు లాభం అనుకోండి. ఊరికే మాటే కదా! పదివేలు వస్తున్నప్పుడు మాట్లాడితే ఏమిటి? అని అనుకుంటారు కానీ వెంటనే లోపల నుంచి అబద్ధం ఆడకూడదు అని ఆత్మ నుంచి సందేశం వస్తుంది. మీరు అది పాటించి అబద్ధం ఆడకుండా ఉంటే ప్రస్తుతానికి పదివేలు పోయినట్టు

కనిపిస్తుంది కానీ భవిష్యత్తులో మీరు నష్టపోరు.

ఎప్పుడైతే పదివేలకి ఆశపడి అబద్ధం ఆడి దాన్ని తీసుకున్నప్పుడు భవిష్యత్తులో దానికి పెనాల్టీతో సహా ఇంకా ఎక్కువ నష్టపోవాల్సి వస్తుంది. అలా నష్టపోయినప్పుడు ఎంతో బాధపడతారు. అంటే మీ డబ్బులు ఎవరైనా కొట్టేయొచ్చు, ఏదైనా రోగం వచ్చి ఆ డబ్బంతా ఖర్చయిపోవచ్చు. ఏదో రకంగా మొత్తం మీద ఇంకా ఎక్కువ డబ్బే ఖర్చవుతుంది.

అలా మీరు బాధపడకూడదు అనే అంతరంలో ఉన్న భగవంతుడు మిమ్మల్ని హెచ్చరిస్తాడు. ఎవరైతే ఆ అంతరాత్మ హెచ్చరికల్ని పాటిస్తూ ఉంటారో వాడు భగవంతుడికి శరణాగతి పొందినట్లే లెక్క.

మీరు బస్సులో వెళ్తున్నారు. ఆ రష్ లో కండక్టరు డబ్బు అడగలేదు, మీరు దిగిపోతారు. వెంటనే లోపల నుంచి నువ్వు డబ్బు ఇవ్వకుండా వచ్చేసావు అని హెచ్చరిక వస్తుంది, మళ్ళీ ఇంకో ప్రక్కనుంచి వాడు అడగలేదు కదా? మనమేం చేస్తాం అని ఇంకో సందేశం వస్తుంది, మళ్ళీ ఆత్మ వాడు అడగక పోయినా ఇవ్వవలసిన ధర్మం నీకుంది అని వస్తుంది. కానీ గమనిస్తే ఇవ్వాలని చెప్పేది అంతరంలో ఉన్న ఆత్మ అంటే భగవంతుడు, పరవాలేదు అనేది మనస్సు.

ప్రతి ఒక్కరిలో శరీరం కాకుండా రెండు ఉంటాయి అవి మనస్సు, ఆత్మ అని ఇంతకుముందే చెప్పుకున్నాం. మనస్సు అంటే మానవుడు, ఆత్మ అంటే భగవంతుడు. మనస్సు ధర్మ, అధర్మాలు చూడదు, ఎంతసేపు తాత్కాలిక లాభమే చూస్తుంది, కానీ ఆత్మన్నది ఎంతసేపు “ధర్మమే” చెప్తుంది. అలా మీరు ఆత్మ చెప్పిన ధర్మాలు పాటిస్తే మీ జీవితం గొప్పగా ఉంటుంది. ఎందుచేతనంటే అధర్మం అన్నది తాత్కాలికంగా లాభం కలిగించినట్టు ఉంటుంది కానీ తర్వాత ఎంతో నష్టపోతారు.

మహాభారతంలో చూశాం కదా! అధర్మంగా జూదంలో గెలిచినటు వంటి దుర్యోధనుడు, యుద్ధంలో మొత్తం తన రాజ్యాన్ని, కుటుంబ సభ్యులు,

బంధువులతో సహా అందరిని కోల్పోవలసి వచ్చింది. "ధర్మాన్ని" ఆశ్రయించిన ధర్మరాజు మొత్తం రాజ్యాన్ని సంపాదించుకోవడమే కాదు ఎంతో లాభం పొందాడు.

అందుచేత అంతరాత్మ అంటే భగవంతుడు ఎప్పుడు మనకు ధర్మాన్నే బోధిస్తూ ఉంటాడు. ఎవరైతే ఆయనకు శరణాగతి చెందుతారో అంటే ఎవరైతే బాగా ధ్యానం చేస్తారో వాళ్ళకి మనస్సు యొక్క ప్రాముఖ్యం తగ్గి "ఆత్మ ప్రాముఖ్యం" పెరుగుతుంది. అప్పుడు ఎక్కువగా అంతరంలో ఉన్నటువంటి ఆ హెచ్చరికలు, సందేశాలు బాగా గ్రహించగలుగుతారు, తెలుసుకోగలుగు తారు, వాటిని అనుసరించ గలుగుతారు. ఇది ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి, ఎవరైతే భగవంతునికి శరణాగతి చెందుతారో వారికి అంతా లాభమే, వారిని మించినవాడు ఎవడు ఉండదు.

ఎందుచేతనంటే భగవంతుడు మనల్ని సరైన దారిలో నడిపిస్తాడు, సృష్టికి అనుగుణమైన పనులు చేయిస్తాడు, పొరపాట్లు చేయనివ్వడు. ఇంక కష్టాలు, బాధలు, సమస్యలు ఎందుకు వస్తాయి? అపుడు జీవితం వైభవంగా ఉంటుంది.

ఇది మీరు ఎంత బాగా గుర్తుపెట్టుకుంటే అంత లాభం పొందుతారు. మీరు ఆ రకంగా పాటించాలి అంటే ఖచ్చితంగా ధ్యానం చేయాలి, సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి. మీరు ఎంత ఎక్కువ ధ్యానం చేస్తే ఆత్మకు అంత దగ్గర అవుతారు, ఆత్మ సందేశాలు గ్రహించ గలుగుతారు.

# సమస్య వల్ల ఆందోళన పడితే ఏ లాభం వుండదు

**"ఏదైనా సమస్య మిమ్మల్ని బాధించినప్పుడు నిశ్శబ్దంగా కూర్చొని దాని మూలస్థానాన్ని గుర్తించండి, ఆందోళన పడితే ఏ లాభం ఉండదు."**

ఈ విషయమే నేను అస్తమాను చెప్తూ ఉంటాను. ఏ కష్టం వచ్చినా, సమస్య వచ్చినా, ఏ రోగం వచ్చినా కంగారు పడిపోతారు. వాళ్ళని, వీళ్ళని ఆశ్రయిస్తారు. గుడికి, చర్చికి వెళ్తారు, పూజలు, ప్రార్థనలు చేస్తారు. కానీ అలా ఆశ్రయిస్తూ ఉంటే ఎంతోమంది దొంగ స్వామీజీలు, బాబాలు, ఆఖరికి కొంతమంది పిరమిడ్ మాస్టర్లు కూడా రకరకాలుగా సలహాలిస్తూ తప్పుదారిలో నడిపించి వాళ్ళ స్వార్థానికి బలి చేస్తూ ఉంటారు.

అందుకే ఏ రోగం వచ్చినా, ఏ సమస్య వచ్చినా, ఏ కష్టం వచ్చినా ఊరికే కంగారు పడకు. అసలు ఈ సమస్య నా జీవితంలో రావడానికి కారణం ఏమిటి? నాకే ఎందుకు వచ్చింది? ఇప్పుడే ఎందుకు వచ్చింది? అని ఆలోచించండి? అప్పుడు దానికి కారణం మీకు బోధపడుతుంది.

ఎప్పుడైతే కారణం మీకు బోధపడిందో, అలాంటి తప్పు మళ్ళీ చేయకుండా జాగ్రత్త పడతారు, భవిష్యత్తులో అలాంటి కష్టాలు రావు.

ఎప్పుడైతే ధ్యానం చేసి శక్తి సంపాదిస్తారో! కొన్నాళ్ళు ఓపిక పడితే ఆ కర్మ పూర్తయిపోతుంది, ఆ కష్టంలోంచి బయట పడిపోతారు. అందుచేత మాణిక్యేశ్వరి మాత చెప్పినట్టు సమస్య వచ్చినప్పుడు కంగారు పడకుండా నిశ్శబ్దంగా కూర్చొని దాని మూలస్థానాన్ని, మూల కారణాన్ని మీరు తెలుసుకోవాలి.

ఊరికే ఆందోళన పడకూడదు. అలా ఒక రోగం వచ్చినా, ఓ కష్టం వచ్చినా, ఓ నష్టం వచ్చిన సరే.

మీకు ఎవరో ఒక లక్ష రూపాయలు ఎగ్గొట్టారు అంటే ఇంతకు

ముందు జన్మలలో నేను ఎవరికో  లక్ష రూపాయలు దెబ్బ వేసాను, ఆ దెబ్బ ఇప్పుడు నాకు పడిపోయింది అని తెలుసుకోండి. ఎవరో మిమ్మల్ని మోసగించారు అంటే  మీరు ఇంతకుముందు ఎవరినో మోసం చేశారు అని తెలుసుకోండి. మీకు నష్టం జరిగింది అంటే ఇంతకుముందు మీరు ఎవరినో నష్టపెట్టారాని తెలుసుకుంటే భవిష్యత్తులో మీరు ఎవరిని నష్టపెట్టరు, ఎవరిని మోసగించరు,  ఎవరిది అపహరించరు.  అలా జీవితాన్ని సరి చేసుకుంటారు. అందుచేత సమస్య వచ్చినప్పుడు ఊరికే ఆందోళన, కంగారు పడకూడదు.

మీరు  కంగారు పడకుండా ఆ మూల కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయండి. మీరు ఎందుకు ఊరికే కంగారు పడతారు, వాళ్ళని, వీళ్ళని ఆశ్రయిస్తారు. మీకు ఏది వచ్చినా ఇంతకుముందు చేసిన కర్మల వల్లనే అని తెలుసుకుని ఊరికే ఆందోళన పడకూడదు. కర్మ చేసారు, వచ్చింది. కొన్నాళ్లు ఓపిక పడితే దాని నుంచి బయటపడతారు. ఈ లోపులో కంగారు పడినా, ఆత్రుత పడినా, ఆందోళన పడినా ఏమి ప్రయోజనం లేదు.

దాని మూల కారణాన్ని తెలుసుకొని, సరి చేసుకునే ప్రయత్నం చేయాలి. అదే మాణికేశ్వరి మాత మనకి చెప్తున్నారు. ఇవన్నీ మీరు ఎంత పాటిస్తూ ఉంటే జీవితంలో అంత లాభం పొందుతూ ఉంటారు. మీరు ఎన్నో కర్మలు చేసి వచ్చారని తెలుసుకోండి.

అందుచేత ఊరికే  కంగారు పడనవసరం లేదు,  కంగారు పడినంత మాత్రాన ఏమీ ప్రయోజనం ఉండదు. ఏదైనా సమస్య మిమ్మల్ని బాధిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా కూర్చుని దాని మూలస్థానాన్ని అంటే కారణాన్ని గుర్తించండి. ముందు  కష్టం వస్తే కారణం తెలుసుకుని దాన్ని సరి చేసుకునే ప్రయత్నం చేయాలి, అదే తెలివైన వాడి పని.

# వినయంతో చేసే సేవ వల్ల కలిగే సంతృప్తి

**"సాధువులు, పెద్దలు, పిల్లలకు, నిరుపేదలకు వినయంతో సేవ చేయండి. అది మీకు గొప్ప సంతృప్తిని ఇస్తుంది అన్నారు."**

ఇది కూడా చాలా అద్భుతమైన సందేశం సాధువులు అంటే సాధకులకు, అలాగే పెద్దలకి, పిల్లలకు, నిరుపేదలకు మీ వంతు సేవ చేయండి, అది మీకు ఎంతో తృప్తినిస్తుంది.

పత్రి గారు "సేవ" కూడా ప్రముఖంగా చెప్తూ ఉంటారు. మనం ఆత్మలం కాబట్టి ఆత్మ లాభం కోసం ఆత్మ సేవలు చేయండి అని చెప్తారు. ఆత్మ సేవలు అంటే ధ్యాన సంబంధమైన సేవలన్నీ కూడా ఆత్మ సేవలే. ఈ ధ్యానాన్ని అందరికీ చెప్పడం, ధ్యాన కార్యక్రమాలను నిర్వహించడం, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించే వారికి సహాయం చేయడం, పత్రిగారి యజ్ఞాలలో పాల్గొనడం అన్నీ ఆత్మ సేవలే.

ఇలా ఈ సేవా కార్యక్రమాలలో ఎంత పాల్గొంటారో దాని యొక్క ఫలితం ఖచ్చితంగా పొంది తీరుతారు. అంతెందుకు మీరు ఏదైనా సేవ చేసి కొంచెం మిమ్మల్ని మీరు గమనించుకుంటే ఎంతో సంతృప్తిగా ఉంటుంది, తెలియని ఆనందం లోపల నుంచి మీరు అనుభవిస్తూ ఉంటారు. అదే మీరు ఏమైనా తప్పు చేస్తే లోపల ఎంతో అసంతృప్తిని, ఎంతో బాధను అనుభవిస్తూ ఉంటారు, వ్యధ చెందుతూ ఉంటారు. అందుచేత వృద్ధులకి, పిల్లలకి, నిరుపేదలకి సాధువులకి వీలైనంత సహాయం చేయాలి. మన వంతు ఎంత వీలైతే అంత ధన రూపేణా చెయ్యొచ్చు, సమయం రూపేణా చెయ్యొచ్చు, శక్తి రూపేణా చెయ్యొచ్చు ఇలా ఎన్నో రకాలుగా చెయ్యొచ్చు.

పత్రిగారు ఇంకా ఏం చెప్తారంటే నీకు తెలిసున్న జ్ఞానాన్ని అందరికీ బోధించు. ఈ అద్భుతమైన ధ్యాన మార్గాన్ని అందరికీ చెప్పు. ఇది కూడా

మీకు గొప్ప సంతృప్తిని ఇస్తుంది అని అంటారు. అందుకే మన వాళ్ళు చాలామంది ఆ ఆనందాన్ని పొందడమే కాదు, వాళ్ళు ఏమంటారంటే ధ్యానం అందరికి చెప్పడం వలన నాకు చాలా ఆనందంగా ఉందని చెపుతూ ఉంటారు!

మాణికేశ్వరి మాత ఊరికనే చెప్పలేదు. సేవ అన్నది మీకు ఎంతో సంతృప్తిని ఇస్తుంది. మీరు చెడ్డ చేస్తే అసంతృప్తిగా ఉంటుంది, వ్యద చెందుతూ ఉంటారు. అదే మీరు ఇతరులకి లాభం, సేవ చేస్తే అంటే మీరు ఇతరులకు ఏ రకంగా లాభం కలిగించినా దానికి ప్రతిగా తిరిగి మీరు ఆనందం పొందుతూ ఉంటారు ఇదే అందులో ఉన్న "రహస్యం."

ఇది ప్రాక్టికల్ గా మా జీవితంలో నేను, మా మేడం చూసాం. అంతకు ముందు వ్యాపారం చేసే వారం. ఏదో చిన్న చిన్న సేవలు కొద్దిగా చేసేవారం, కానీ వ్యాపారం మీద ఎక్కువ దృష్టి ఉండేది. సంపాదించదానికి ఏదో సంపాదించేవారం అని అనుకునేవాళ్ళం కానీ పత్రిగారి పరిచయమై ఈ మార్గంలోకి వచ్చాక వ్యాపారాలన్నీ మూసి మాకు ఉన్నటువంటి సమయాన్ని అందరికీ సేవకు ఉపయోగిస్తున్నాం. మేము సంపాదించుకున్న జ్ఞానాన్ని అందరికీ పంచుతున్నాం.

అలాగే మా వాక్కుని, మా శక్తిని, మా జీవితాన్ని అందరికీ పంచుతున్నాము. నిజంగా ఎంతో సంతృప్తిగా మేము జీవించగలుగుతున్నాం. మనకంటే అదృష్టవంతులు ఎవరున్నారని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాం. పత్రిగారి పరిచయం కావడం మాకు ఎంతో లాభం కలిగించింది లేకపోతే ఏమైపోయే వాళ్ళమో అని అనుకుంటాం.

ఆ పిల్లల దగ్గర ఉంటే అస్తమాను వారితో గొడవలు, ఇంకా కొంతమంది ఆ పిల్లల దగ్గరే ఉండడం వల్ల రిలేషన్స్ దెబ్బతిని నరకం అనుభవిస్తూ ఉంటారు. కానీ మా పిల్లలు వేరే ఉన్నా వాటి గురించి మేము ఆలోచించం. మా సేవలు, మా కార్యక్రమాలు, మా పనులు మావే, ఇలాంటి

సేవలలో మేము పాల్గొనడం వలన ఎంతో సంతృప్తిని పొందుతున్నాం. ప్రతి నెల మూడు రోజుల క్లాసులు పెడుతున్నాం, ఎన్నో వందల మంది వచ్చి జ్ఞానాన్ని పొందుతున్నారు.

ఇక్కడే కాదు, ఇతర గ్రామాలలో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ అవకాశం ఉన్నంతలో మేము ఈ జ్ఞానాన్ని అందరికీ అందిస్తున్నాం, ఆత్మ సేవ అంటే అందరికీ ఆనందం కలిగించడమే! అదే పత్రి గారు చేసారు,

అందుచేత గొప్ప వాళ్ళ మాటలు అర్థం చేసుకొని దానికి అనుగుణంగా జీవించగలగాలి. అందుకే మీరంతా ఆ స్థాయికి వెళ్ళిన వారు. యోగులు, మహాత్ములు, గొప్పవారు ఆ రకమైన సేవనే ప్రోత్సహిస్తున్నారు.

అలా సత్య సాయిబాబా వారు కూడా సేవకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ఆయన అందరినీ ప్రేమించండి, అందరికీ సేవ చేయండి అంటారు.

అదే మాణికేశ్వరి మాత చెప్తున్నారు "అందరికీ సేవ చేయండి అని ఉన్న దాంట్లో కొంత ఇటువంటి వాటికి చేయగలిగినా లాభమే." భీమవరం క్లాసులో మీరు పాల్గొంటే సేవ చేయాలనేటువంటి అభిప్రాయం కలుగుతుంది. అరే, వారిద్దరూ కలిసి ఇంతమందికి ఉచితంగా ఇంత సేవ చేస్తున్నారే! మనం ఎంత చేయాలి అని వాళ్ళు అభిప్రాయానికి వస్తారు.

అలా ఎంతోమంది ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఎంతోమందికి లాభం కలిగిస్తున్నారు, ఆనందం పొందుతున్నారు. అందుచేత సేవ అన్నది కచ్చితంగా సంతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తుంది అన్న సంగతి తెలుసుకోండి. ఇవన్నీ మరొక్కసారి వింటూ దానికనుగుణంగా మీరు జీవిస్తే మీ జీవితం ధన్యమైనట్టే. ఇంక మీకంటే అదృష్టవంతుడు ఎవరు ఉండరు.

# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | Losses caused by Desires | Rs.100 |
| 7. | Benefits of knowing what happens after death | Rs.100 |
| 8. | What is Meditation? | Rs.80 |
| 9. | True Path | Rs.80 |
| 10. | Why soul-knowledge ? | Rs.70 |
| 11. | What comes after death ? | Rs.70 |
| 12. | Learnings through the male and female births | Rs.70 |
| 13. | Who are Soul-murderes? | Rs.70 |
| 14. | How to improve Financial Status ? | Rs.60 |
| 15. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 16. | Knowledge of Brahman (Brahma-Jnan) | Rs.60 |
| 17. | What is Intention? | Rs.50 |
| 18. | Why is this life? | Rs.50 |
| 19. | Shankaracharya's Jagrata panchakam | Rs.50 |
| 20. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 21. | Brahman means? | Rs.50 |
| 22. | How to become a master? | Rs.50 |
| 23. | How to become a champion ? | Rs.50 |
| 24. | Truth | Rs.50 |
| 25. | Meditation for the Development of Students | Rs.40 |
| 26. | Non violence and vegetarianism | Rs.40 |

| | |
|---|---|
| REBIRTH (Tatavarthy Rajya Lakshmi) | Rs.150 |
| What is Ignorance (Avidya) ? | Rs.70 |

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు– రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం?- రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
43) మోక్షం అంటే? - రూ.70/-
44) కబీరు సందేశాలు-1 -రూ.70/-
45) కబీరు సందేశాలు-2 -రూ.60/-
46) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
47) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
48) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
49) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
50) అతీంద్రియ శక్తులు - రూ.60/-
51) ఆలోచించండి - రూ.60/-
52) నిర్వాణ మార్గం - రూ.60/-
53) ధ్యానులకు సూచనలు - రూ.60/-
54) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
55) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
56) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
57) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
58) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
59) సంకల్పమంటే? - రూ.50/-
60) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
61) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
62) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
63) అరిహంత్ - రూ.50/-
64) మూడురకాల జీవితాలు -రూ.40/-
65) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
66) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
67) బ్రహ్మం అంటే? -రూ.40/-
68) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
69) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
70) మహాత్ముల సందేశాలు - రూ.40/-
71) సత్యం - రూ.40/-
72) చక్రాలు - రూ.40/-
73) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
74) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
75) మౌన ధ్యానం - రూ.40/-
76) విదురుని సందేశాలు - రూ.40/-
77) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
78) శాకాహారమే మానవాహారం - రూ.15/-
79) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



## మాణికేశ్వరి మాత సందేశాలు

- "భగవంతునికి (ఆత్మకి) సంపూర్ణ శరణాగతి చెందండి."
- "ఏదైనా సమస్య మిమ్మల్ని బాధించినప్పుడు నిశ్శబ్దంగా కూర్చొని దాని మూలస్థానాన్ని గుర్తించండి. ఆందోళన పడితే ఏ లాభం ఉండదు."
- "ప్రారబ్ధ కర్మల ఆధారంగానే ప్రస్తుత జన్మ తీసుకున్నారు. ఇతరులకు మంచి చేయడం ద్వారా వర్తమానంలో వాటి చెడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు."
- "మీరు తినే ఆహారంతోనే మీ ఆలోచనలు, మాటలు, చేష్టలు ప్రభావితం అవుతాయి. అందుచేత ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి."
- "కేవలం భౌతిక సుఖాలు, సంతోషాల వెనుక అధికంగా పరుగులు తీయకండి. అది మిమ్మల్ని జనన మరణ చక్రంలో పడవేస్తాయి."
- "ఈ భౌతిక శరీరాన్ని మీకు ఇవ్వబడిన బహుమతిగా భావించండి. దానిని పనికిరాని పనులకు ఉపయోగించకండి మీకు అంటే ఆత్మకు లాభం కలిగించే పనులు చేయించండి."
- "సాధువులు, పెద్దలు, పిల్లలకు, నిరుపేదలకు వినయంతో సేవ చేయండి. అది మీకు గొప్ప సంతృప్తిని ఇస్తుంది అన్నారు."

రూ.50/-

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|